# మిత్ర

## మొదటి ప్రకరణము

### సత్కార వాక్యములు

"సమస్తమును పరీక్షించి మేలైనదానిని చేపట్టుడి. ప్రతి విధమైన కీడునకును దూరముగా నుండుడి" 1థెస్స. 5:21-22.

మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి." యాకోబు 1:22. దేవా! నాకు బయలుపడుము. తథాస్తు.

క॥ వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్
కనికల్ల నిజము తెలిసిన
మనుజుడె పో నీతిపరుడు - మహిలో సుమతీ॥

బైబిలు విషయములు క్రైస్తవేతరులకు కాలక్రమమును బట్టి తెలియజేయుటకు, పాపలోకమునకు దేవుడు తన ప్రేమను వెల్లడించుటకై ఏర్పరచిన రక్షణ మహాసంకల్పనను విశదపరచుటకును, ఆ సంకల్పనకు సంబంధించిన చరిత్రలోని ముఖ్యాంశములు పేర్కొనుటకు క్రైస్తవులు బోధించు మోక్షమార్గోప దేశము వినిపించుటకును, దేవదాన గ్రంథమగు బైబిలు చదివింప ప్రోత్సాహపరచుటకు తత్వపరీక్ష చేయుటకును, పారమార్థిక జీవిత ధర్మములు ధర్మముచేయ ప్రదర్శించుటకును క్రైస్తవమత ప్రచారకులకు ఉపదేశ సాధనముగా నుండుటకును యీ సంగ్రహ "మిత్ర" వెడలినది.

Bible Mission HQ Guntur

# రక్షణాహ్వానము

"నాయొద్దకు రండి; నాయొద్ద నేర్చుకొనుడి" మత్తయి 11:28,29 క్రీస్తుప్రభుని మాటలు. దేవుడు కలడను విషయములు ఆది. 1:1; కీర్తన 53:1.

1. 1) భూమ్యాకాశములు మన కంటికి కనబడుచున్నవి. అవి లేవనలేము వాటిని కలుగజేసిన వారొకరుండి తీరవలెను. ఆయనను ఎవరు కలుగజేసిరి అని అనకూడదు. ఎవరివలనను కలుగజేయబడక ఆదిగాని, అంతముగాని యుండక, ఎవరు సృష్టినంతటిని కాపాడుచు పరిపాలించుచున్నారో ఆయనే దేవుడై యున్నాడు. బంతి, నగలు, మేడలు, బిందెలు, కుండలు, చేదలు, గాలి, గాలి విమానములు ఇవి ఎవ్వరును చేయలేదనియు, వాటియంతట అవేకల్గినవనియు వాదించువారు, భూమి దానంతట అదే కలిగినదని చెప్పువారితో సమానులే. అపరిమిత జ్ఞానియగు దేవుని విషయములు మన పరిమిత జ్ఞానమునకు అందనప్పుడు గ్రహింపగలిగిన వాటితో సంతుష్టిపడి ఊరకుండుటయే జ్ఞానము. మొక్క ఎట్లు వృక్షమగుచున్నదో వివరింపలేము గాని నమ్మగలము. జ్ఞానేంద్రియమును నమ్మలేని విషయములు, విశ్వాస లక్షణము నమ్మితీరును. గనుక విశ్వాసమే ఎక్కువ పాండిత్యము గలది. దానివలెననే తుదకు మోక్షము. దేవుడు కలడను విషయము గ్రహించుటకు జ్ఞానమును, నమ్మి ఆనందించుటకు విశ్వాసమును దేవుడే మానవ శరీర నిర్మాణములో అమర్చియున్నాడు. వీటిని తృణీకరించువారే దేవుడు లేడనువారు. ఇది అపాయకరమైన మనోస్థితి. ఆత్మనేత్రములకది ప్రత్యక్షమగును. ఈ అనుభవము దైవప్రార్థన వలన సంపాదించుకొనుడి. లౌకికవిద్య కొంతవరకు తోడ్పడునేకాని దానిని సంపాదించిపెట్టనేరదు. దేవుడున్నాడను సంగతి వినని అరణ్యవాసులు సైతము దేవుని పూజించుచున్నారు. దేవుడే వారి మనస్సాక్షికి బయలుపడెను. 2) దేవుడు

కలడను ఆస్తికులలోయున్న అనేకులు దేవుడు లేడను నాస్తికులకన్న ఏమంత యెక్కువ? ఇబ్బంది కలిగినప్పుడు యిబ్బంది తీర్చు దేవుడున్నాడని ధైర్యము తెచ్చుకొనక ఆయన లేడన్నట్లు దిగులుపడువారును, నాస్తికులు కాక ఆస్తికులా మరి? ఆస్తికులు తమలోని యిట్టి నాస్తికత్వమును, నాస్తికులు తమలోని నాస్తిక నైజమును తొలగించుకొని సుఖజీవులగునట్లు అనుదినము దైవప్రార్థన చేసికొనవలెను.

2. ఒక నాస్తికునికి ఒక క్రైస్తవ బోధకునికి జరిగిన సంభాషణము వినుడి:–

క్రైస్తవుడు:– మీరు దేవుడు లేడనుచున్నారు. దేవా! నీవున్నావా? అని మీరెప్పుడైనా అడిగినారా?

నాస్తికుడు:– లేని వ్యక్తిని అడుగుటయెట్లు?

క్రై:– అయిననేమి? మోకరించి ప్రార్థన చేయుడి. ఉన్నయెడల ఉత్తరమిచ్చును లేకపోయిన లేనేలేదు.

షరా:– ఆయనను పిలువనిదే ఆయన లేడనుట గొప్ప దోషము. గనుక నాతో మోకరించుడి. అడుగవలసినరీతి నేనే నేర్పింతునని చెప్పి క్రైస్తవుడు నాస్తికుని ఒప్పించి మోకరింపజేసెను.

క్రై:– దేవా! నీవు నాకు ప్రత్యక్షమగుము. పాపినైన నన్ను కరుణించుము అని చెప్పండి.

నా:– నాకు నమ్మికలేనిదే యిది యెట్లు చెప్పగలను?

క్రై:– మీ నమ్మికతో మీకేమియు పనిలేదు నేను చెప్పినదే చెప్పుడి.

క్రై:– దేవా! పాపినైన నన్ను కరుణించుము

నా:– దేవా! పాపినైన నన్ను కరుణించుము

క్రై:– నేను ఆగుడి అని చెప్పువరకు యీ మాటలే చెప్పుచుండుడి.

షరా:- ఇట్లు నాస్తికుడు అనేక పర్యాయములు చెప్పిన పిమ్మట "అయ్యో! నేనెంత పాపిని?" దేవా! నీవున్నావని ఇప్పుడు నాకు తెలిసినదని పెద్ద కేక వేసెను.

షరా:- చూచినారా? దైవప్రార్థన చెప్పిన యెడల సత్యమెట్లు తెలియునో!

"దేవుడెక్కడయున్నాడో ఋజువుపరుపగలవా? అని ఒక నాస్తికుడొక బాలుని అడిగెను. దేవుడెక్కడ లేడో ఋజువు పరుపగలవా? అని ఆ బాలుడు యెదురు ప్రశ్నవేసెను.

3. ప్రార్థన:- 1) ఓదేవా! సర్వలోకమును, నన్నును కలుగజేసిన తండ్రీ! నీవున్నావని కొందరును లేవని కొందరును వాదించుచున్నారు. మా మతము దైవమతము, మా మతము దైవమతము అని యెవరి మతమును గురించి వారే గొప్ప చెప్పుకొనుచున్నారు. గనుక నీవు కలవను విషయమును, నీవు స్థాపించిన మతమేదో ఆ విషయమును నా జ్ఞానమునకు బోధించుము. నా జ్ఞానమునకు నచ్చునప్పుడు నీవే స్వయముగా కలలోనో దర్శనములోనే కనబడి నచ్చజెప్పుము. నాకు నచ్చిన పిమ్మట నీ చిత్తానుసారముగా ప్రవర్తింపగల సామర్థ్యము అనుగ్రహింపుము.

2) ఓ దేవా! మరొక మనవి. లోకములో పాపములును పెరుగుచున్నవి. పాపమువలన కలుగు నష్టములును పెరుగుచున్నవి. పాపమువలన కలుగుచున్న యిబ్బందులు, కరవులు, జంతుబాధలు, శత్రుబాధలు, వ్యాధులు, మనోవిచారములు, ఆకస్మిక అపాయములు ఈ మొదలగునవి మమ్మును పీడించుచున్నవి. వీటిని పరిహరింపుము లేదా సహింపగల బలము దయచేయుము, నీకు నమస్కారములు, తథాస్తు.

**4. రక్షణా న్వేషణము:-** వడ్రపు పని కావలెనని కొందరు, కూలి పనికావలెనని కొందరు, పంతులు పని కావలెనని కొందరు,

ప్రభుత్వసంబంధమైన ఉద్యోగములు కావలెనని కొందరు యీ ప్రకారముగా యేదో ఒక వృత్తి కావలెనని ప్రతివారికొక కోరిక గలదు. తమ కోరిక నెరవేర్చుకొనుటకై ప్రజలెంతో కష్టపడుచున్నారు. అధికారులయొద్దకు వెళ్ళి అనేక పర్యాయములు నమస్కారములు పెట్టి మనవి చేయుచున్నారు. అలాగైన యీ వృత్తులన్నియు కల్పింపగల జ్ఞానశక్తిని నరులకనుగ్రహించిన దేవునికి యెన్నిమార్లు నమస్కారములు చేయుచున్నారు? ఆయనకెన్నిమార్లు ప్రార్థించు చున్నారు? వృద్ధాప్యమందు కూర్చుని తినవచ్చునని చెప్పి యౌవనకాలమున ధనము సంపాదించుట కెంత కష్టపడుచున్నారు కాదా? ముందు బ్రతుకును గూర్చి ఆలోచించుటయు అందు నిమిత్తము కష్టపడుటయు మంచిదే. ఈలోక జీవనము చాలించిన పిమ్మట మనము దేవలోకమునకు వెళ్ళవలెనుగదా? దాని నిమిత్తమై యెంత ఆలోచించుచున్నాము? మున్నాళ్లుండి వెళ్ళిపోవునట్టి యీ బ్రతుకు నిమిత్తమై యెంతో కష్టపడుచుండగా శాశ్వతకాలము పరలోకములో జీవింపవలసిన బ్రతుకు నిమిత్తమై యెంత కష్టపడవలెనో ఆలోచించుడి. శాశ్వతము దేవలోకములో దేవుని యొద్దనే యుండి ఆనందింపవలసిన బ్రతుకు నిమిత్తమై యిప్పుడు కష్టపడనియెడల యెప్పుడు కష్టపడుదుము! అట్లు కష్టపడని యెడల శాశ్వతముగ దయ్యములుండు నరకమునకు వెళ్ళవలసి యుండును, జాగ్రత్త పడుడి. అన్ని విద్యలు నేర్చుకొని పరలోకమునకు వెళ్ళుట సూత్రము తెలియనప్పుడు యీ విద్యలవలన ఏమి ప్రయోజనము? ఒకప్పుడు కొందరు దోనెఎక్కి ఆవలకు వెళ్ళుచుండిరి. గాలి రేగినది. దోనె మునిగినది. కూలీలందరు ఈదుకొని పోయిరి. ఒక పండితుడు మునిగిపోయినాడు. కారణమేమి? అన్నియు నేర్చుకొన్న లాభమేమి? ఈత విద్య రానప్పుడు. భూమికంటెను, నరులకంటెను, దేవదూతల కంటెను, ఆకాశములకంటెను, దేవుడు మొదటివాడు, గొప్పవాడు గనుక అనుదినము ముఖ్యముగా, ఉదయమున లేవగానే ఆయననారాధించుటకు వ్రాయించిన గ్రంథమొకటి గలదు. దానికే బైబిలు అని పేరు. దానిలో ఆయన

విషయములు, మోక్షలోక విషయములు, దేవదూతల విషయములు, పాపవిసర్జన దైవభక్తి విషయములు, యీ మొదలైన ఉపకార విషయములున్నవి. గనుక నేర్చుకొనుడి.

## అనాది

1. దేవుడు

1) దేవుడొక్కడే. దేవుండ్లనేకులైన నెవరిని పూజించవలెనో తెలియదు. వారిలో వారికి పడకపోయినా చిక్కే.

2) దేవుడు అనాదియందు ఒంటరిగానే యుండెను. అప్పటికి లోకములుగాని, దూతలుగాని, నరులుగానిలేరు. కాలమనునదే లేదు. మన ఊహకు వచ్చునదేదియులేదు. దేవునికి ఆదిలేదు. ఎప్పటినుండి ఉన్నాడో అనునది ఆలోచించుట మన మనస్సు కనవసరము.

ఆది. 1:1; ద్వితీ 33:27; దా.కీ. 90:20; ప్రక. 4:8–10; దేవుడొక్కడే నిర్గమ 20:3; యెషయా 42:8; 10:23; 44:6–24; 45:5.

త్రిత్వము:– ఆది 1:1–3; సంఖ్యా 6:24–26; యెషయా 6:3; మత్తయి 3:13–17; 28:19; నరునిలోకూడా త్రిత్వమున్నది 1థెస్స. 5:23.

## 3) దైవలక్షణములు

జీవము, స్వతంత్రత, ప్రేమ, న్యాయము, పరిశుద్ధత, శక్తి, జ్ఞానము, సర్వవ్యాపకత్వము మొదలైన సద్గుణములతో దేవుడనాదిని వెలుగుచుండెను. దేవుడు ఆది అంతము లేనివాడు.

దేవుడు ఆత్మయైయున్నాడు. యోహాను 4:24; 2కొరింథి 3:17.

శక్తి:– ఆది 17:1; నిర్గమ 6:3; ప్రేమ: 1యోహాను 4:8, 16; న్యాయము: ద్వితీ 32:4; పరిశుద్ధత : కీర్తన 99:9; యెషయా 5:16. సర్వవ్యాపకత్వము : కీర్తన 139:7; యిర్మీయా 23:24. అంతములేనివాడు: 1తిమోతి 1:17; 6:16; కొలస్సై 1:15.

4. ఆయన పని

దేవదూతలను, ఆకాశమును, భూమిని, పిమ్మట నరుని కలుగజేయవలెననియు నరుని రక్షించు సంకల్పన నడుపవలెననియు దేవుడాలోచించుచుండెను. ఇదే ఆయన అనాదిలో చేయుచుండిన పని ఎఫెసీ. 1:3-12.

# 2వ ప్రకరణము

## దేవదూతలు

తనను ఆరాధించుటకును, తాను చెప్పిన పని చేయుటకును నరులకు సహకారులై యుండుటకును దేవుడు దేవదూతలను కలుగజేసెను. వారు ఆత్మస్వరూపులు. వారు పురుషులు కారు, స్త్రీలు కారు. నిత్యము దైవస్తుతి చేయుదురు. దేవుని సృష్టిని కాపాడుట వీరి ఆనందవృత్తి. వీరు మనయొద్ద కావలియుందురు. వీరు మన మిత్రులు, మనము దేవుని నమ్మిన యెడల నమ్మకస్తులుగ నున్న దూతలు పాపముచేయుట చేతగాని వరమును దైవచిత్తమును నెరవేర్చగల వరమును పొందినవారైరి (మత్తయి 6:10) గనుక దయ్యాలు వీరిని ఏమియు చేయలేవు. యోబు 38:7; కీర్తన 91:11; 1రాజులు 19:5; నెహెమ్యా 9:6; యోబు 25:2; కీర్తనలు 104:4; 148:2; యెషయా 6:2; మత్తయి 13:39; మార్కు 8:38.

# 3వ ప్రకరణము

## సైతాను పిశాచములు

ఒక ప్రధాన దూత దేవుని నెదిరించెను. గనుక అతడును అతనిజట్టు దూతలను దయ్యములుగా మారిపోయినందున దేవలోకము

విడిచిపెట్టవలసి వచ్చెను. దేవుని సృష్టిని పాడుచేయుటయే వారి ముఖ్యోద్దేశము. (ఆ ప్రధాన దూతను సైతానందుము. "మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె యెవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" 1పేతురు 5:8. "అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును" యాకోబు 4:7; యూదా 6వ; ఎఫెసీ 6:11; 1దిన 21:1; దా.కీ. 109:6; లూకా 4:2; యోబు 1:6; మత్తయి 12:24; 2 కొరింథి 6:15; లూకా 10:18; మత్తయి 4:3; కార్య 5:3; మత్తయి 4:5; 1థెస్స 2:18.

# 4వ ప్రకరణము

## లోకములు

నరుడు నివసించుటకును భూమిని, వెలుగు కలిగి యుండుటకును జ్యోతులను, భుజించుటకును వృక్షఫలములను, త్రాగుటకు ఉదకమును, పీల్చుటకు గాలిని దేవుడు కలుగజేసెను. నరునికేమియు కొదువలేదు. దేవుడొక స్త్రీని కలుగజేసి అతనికామెను భార్యగా నిచ్చెను. వీరు మహాపవిత్రులుగా నుండి దైవసన్నిధినే నివసించువారు. పాపప్రవేశానంతరమున జన్మించిన మనము వారి పవిత్రతను గ్రహింపలేము ఆది 1,2 అధ్యాయములు.

## పరిశుద్ధ లోకము

దేవుడును, మనుష్యులును కలిసియుండువారు. దేవుడు వారితో మాటలాడుచుండువాడు. జీవరాసులను నరులును స్నేహభావము కలిగియుండిరి. సృష్టియావత్తు మహాపరిశుద్ధముగా నుండెను. నరుడు దేవుని లక్షణములు కలిగియుండెను. అందుచేతనే దేవుడు నరుని తన పోలికగా చేసెనని చెప్పుదురు ఆది. 1:27.

# 5వ ప్రకరణము

## పాపము రక్షణ

సాతాను మనుష్యులను పాపములో ప్రవేశపెట్టెను. అప్పుడే దేవునికిని మనుష్యునికిని యెడబాపు కలిగెను. భూమికి శాపము వచ్చెను. అందుచేతనే ముండ్లు, విషము, వ్యాధి, కరవు, మరణము ఇవి ప్రవేశించినవి. దేవుడు వారిని క్షమించి లోకరక్షకుని పంపెదనని వాగ్ధానముచేసెను. ఆవేళ వారికెంత ఆనందమో! ఆది 3:15.

# 6వ ప్రకరణము

## సైతాను సృష్టి

**1. సైతాను:-** తనలో దుర్బుద్ధి కలిగించుకొనుట. 2. అతడు యితర దూతలలోగూడ ఆ దుర్బుద్ధిని కలిగించుట. 3. అదే నరులలో ప్రవేశపెట్టుట. ఉదా:- ప్రేమలేనితనము, అజ్ఞానము, అశక్తి, అపవిత్రత, అజాగ్రత్త, అనాగరికత, అన్యాయము, దేవునియెడల దురభిప్రాయము, ఆయన వాక్యమును మన్నన చేయకపోవుట, స్వతంత్రతలేని స్థితి, భయము, అపనమ్మిక, సందేహము, దూషణ, దేవునిసృష్టిని పూజించుట, దేవునిపూజ మానుట, నాస్తికత్వము, దైవసంకల్పనను తృణీకరించుట, దేవునిపై నేరములు మోపుట. విసుగుకొనుట, కోపము, అసూయ, అమర్యాద, దురాశ, నిరాశ, హత్య, వ్యభిచారము, కలహము, యుద్ధము, దొంగతనము, అబద్ధము, చాడీలు చెప్పుట, అపకీర్తి కలిగించుట. త్రాగుడు, జూదము, తిండిబోతుతనము, దేవుడిచ్చినవరములు వాడకపోవుట, అవి స్వంతమేలు నిమిత్తము మాత్రమే వాడుకొనుట, తలంపులోను, చూపులోను, వినికిలోను, మాటలోను, ప్రయత్నములోను, క్రియలోను, నైజములోను, ఏదోయొక చెడుగు కలిగియుండుట, బైబిలు

విగ్రహారాధనను నిషేధించుచున్నది. దేనినైనను ఎక్కువగా జూచుటకూడ విగ్రహారాధనయే. ఇవన్నియు సైతాను కార్యములే. నిర్గమ 32:1; మత్తయి 5:3,4న లేవీ 19:12; ద్వితీ 18:10; 2తిమోతి 3:5; మత్తయి 15:8; ప్రసంగి 5:1; సామె. 30:17; నిర్గమ 21:15; మత్తయి 6:21; ఎఫెసీ 4:31; నిర్గమ 20:14; మత్తయి 5:28; గలతీ. 5:19–21; నిర్గమ 20:15; 1తిమోతి 6:10, 16; ఎఫెసీ 4:25; సామె 11:13; నిర్గమ 23:1; సామె 25:18; నిర్గమ 20:17న యాకోబు 1:14,15; మత్తయి 23:14; యెహెజ్కేలు 18:4; ఆది 3:4,5; 1యోహాను 4:20; 1యోహాను 3:8; కీర్తన 53:1.

పాపవృద్ధి

మొదటి నరులు ఒక్క పాపమే చేసిరి. తర్వాత వచ్చిన ప్రజలు అనేక పాపములు చేయుచున్నారు. నరులు వృద్ధికాగా పాపమును వృద్ధియైనది. పాపముతోపాటు పాపములవలన వచ్చు కీడును వృద్ధియైనది ఆది. 6:1–6.

# 7వ ప్రకరణము

## నిరీక్షణ కాలము

పాపములేని ఆదిమానవులయొద్ద నివసించిన దేవుడు వారి పాపమును బట్టి కనబడుట మానివేయగా, తదనంతరము జన్మించిన వారిలో అనేకులు కనబడని దేవుని నారాధింప నిష్టపడక ప్రత్యక్షముగా కనబడుచు ఉపకారాదాయముగా నున్న ప్రకృతిని ఆరాధింప ఆరంభించిరి. దేవుడు వారిలో పెట్టిన మనస్సాక్షి మాట వారు వినరైరి. మంచి చెడ్డలను తెలుపునది మనస్సాక్షి. సృష్ట్యారాధికులను, దైవారాధికులును చాలకాలము కలిసియుండిరి. కొన్నాళ్ళకు దేవుడిద్దరిని వేరుచేసెను. ఇది దేవుడు భూజనాంగములలో నుండి ఒక ప్రత్యేక జనాంగమును లేవనెత్తిన

చరిత్రవలన తెలియుచున్నది. ఆ జనాంగమునకే యూదుల జనాంగమని పేరు. యూదుల నాయకులకే దేవుడప్పుడప్పుడు ప్రత్యక్షమై గొప్ప గొప్ప విషయములను వినిపించుచు వచ్చెను. ఆ యూదులలోనే లోకరక్షకుడు జన్మించునని వారి నాయకులు ప్రకటించిరి. దైవబోధ యూదులు మొదట నేర్చుకొనవలెనియు, పిమ్మట ఇతరులకు నేర్పవలెననియు దేవుని యుద్దేశ్యము. లోకరక్షకునికొరకు ప్రజలెదురు చూచిన నాల్గువేల సంవత్సరములకు నిరీక్షణ కాలమని పేరు. యూదులకే వేదము దొరికినది. దేవుడు చెప్పి వ్రాయించిన మాటలందులో గలవు. వారి వేదము బైబిలులోని మొదటి భాగమగు పాతనిబంధన. రక్షకుడు రానైయున్నాడని యిందులో లిఖితమై యున్నది. అదే యూదుల మతము. యూదులకు మనస్సాక్షి కలిగియున్నను వారికి గ్రంథమును బట్టి నడువవలసిన విధియొకటిగలదు. దేవుడు పంపెదనని వాగ్ధానమిచ్చిన రక్షకుని కొరకెదురుచూచుట, రెండవభాగమగు క్రొత్త నిబంధనలో లోకరక్షకుడు వచ్చినాడని ప్రకటించుట. ఈ రెండు భాగములు కలిసి బైబిలను దైవవాక్య గ్రంథమైనది. లూకా 2:25; 24:21; కార్య. 15:14; రోమా 9:4-5; ద్వితీ. 4:5-8; ఆది 12:1-3.

# 8వ ప్రకరణము

## నిశ్శబ్దకాలము

ఆదినుండియు నరులకు చెప్పవలసిన మాటలన్నియు దేవుడు చెప్పి పాతనిబంధన గ్రంథము వ్రాయించెను. యూదులకు నేర్పవలసినవి నేర్పి వారిచేత చేయింపవలసినవన్నియు చేయించెను. రక్షకుని జన్మమును గురించి ఇక దేవుడు చెప్పవలసినవి లేవు గనుక ఆయన మాటలాడుట మానివేసెను. అందుచేతనే యీ కాలమునకు నిశ్శబ్దకాలమని పేరు వచ్చినది. ఈ నిశ్శబ్ధకాలమందు స్వభావ సిద్ధముగా నిరాశ ప్రవేశించును.

అయినను యూదులలో దైవవాగ్ధాన వాక్యముల యెడల గల నిరీక్షణ మరింత వృద్ధి కావలసియున్నది. దేవుడు మాటలాడకపోయినను విశ్వాసము పెరగవలెను. ఇది నిశ్శబ్దకాలోపదేశమని గ్రహింపవలెను.

దేవుని మాటలు, పెద్దల మాటలు, యూదులచరిత్ర, రక్షకుని రాకడ ప్రవచనములు, సర్వావస్థలయందు జ్ఞానోదయమును ఆదరణను కలిగించు వాగ్ధానములు గల పాతనిబంధన వారికుండగ నిరీక్షణను క్షీణింపజేసికొనిరి.

# 9వ ప్రకరణము

## యోహాను కాలము

ప్రవక్తలందరు క్రీస్తువచ్చునని ప్రవచించిరి. యోహాను క్రీస్తు వచ్చినాడని ప్రకటించెను. యూదుల మతము క్రీస్తు వచ్చునను అంశమును, క్రైస్తవ మతము క్రీస్తువచ్చినాడను అంశమును బోధించెను. క్రైస్తవ మతము యూదల మతముయొక్క నెరవేర్పు. యూదులారా, మనమెదురుచూచిన క్రీస్తుప్రభువు వచ్చినాడు గనుక ఆయనలో చేరుడి అని యోహాను బోధయొక్క ధోరణియైయుండెను. అందుచేతనే యోహాను తన శిష్యులలో నిద్దరిని మాదిరికి క్రీస్తునొద్దకు శిష్యులనుగా పంపెను. యూదులను యోహాను క్రీస్తు నంగీకరించు స్థితికి తన బోధవలన తెచ్చెను. యూదులమతము కాయ, క్రీస్తు మతము పండు. యెషయా40:3; మలాకీ 4:5; లూకా 1:17; 1:57; 1:57-60; లూకా 1:79; మత్తయి 3 అధ్యా; మార్కు 1 అధ్యా; లూకా 3వ అధ్యా. దేవుని ముఖమునుండి సందేశము అందుకొనగల మోషే, యెహోషువ, సమూయేలు, దావీదు, యెషయా, యిర్మీయా, దానియేలు, యెహెజ్కేలు, హోషెయా, మీకా, జెకర్యా, మలాకీ మున్నగు దైవజ్ఞులు గతించిరి. అయినను వారి సందేశముల వ్రాతకట్ట మాత్రము గతింపలేదు.

లోకరక్షకుని ప్రవేశమును ప్రకటించు మహర్షి రానైయున్నాడొహో అనునది నిశ్శబ్ధకాలారంభమున మలాకీద్వార యూదులకు వినబడినది. కడవరి శ్రవణానంద స్వరమైయున్నది. ఆ మహర్షి పేరు యోహాను. సూర్యుడు వచ్చుననగా అతని రాకను సూచించు వేగుచుక్కవంటి వాడీ యోహాను ప్రవక్త. మెస్సీయా తట్టు అనగా క్రీస్తు తట్టు యూదుల దృష్టిని గిర్రున త్రిప్పుటకు పాటుపడిన యీ యోహాను వనవాసియును నూతన సందేశవాహినియును గంభీర స్వరముగల నిర్భయ ప్రసంగియును ప్రజలు నిరాశ సముద్రమున మునుగుచున్న కాలమున వెలసిన ప్రవక్తయును ఆహార విషయములోను, వస్త్రధారణ విషయములోను, నివాసస్థాన విషయములోను బేధముగా కన్పించు విపరీత యౌవనుడును, ప్రవక్తలెప్పుడువత్తురా, యెప్పుడువత్తురా అని కలవరించుచున్న జనసంఘ హృదయమునకు కాంతి కలిగించుటకై యుక్తసమయమున ప్రత్యక్షమైన హితోపదేశకుడును అగుటచేత పాలెస్తీనా దేశములోని అన్ని ప్రక్కలనుండి వేదాంత పండితులను, సామాన్యులను ఆకర్షింప గలిగెను.

## యేసుక్రీస్తు వారి చరిత్ర

ప్రజలెదురుచూచిన లోకరక్షకుడు ఒక కన్యక గర్భమున యూదులలోనే పాలెస్తీనా దేశమందు జన్మించెను. ఈ వార్త వెంటనే యూదులకు, యితరులకు అందెను. వారాబాలుని దర్శించిరి. ఆ బాలుడు మనపిల్లలవలె పెరిగి పెద్దవాడాయెను. ఆ రక్షకుడు 1) పరిశుద్ధ ప్రవర్తనవలనను 2) దేవుడు మీ తండ్రి నరులు మీ సోదరులు గనుక ఉభయులను ప్రేమించువాడనియు, నేనే ముక్తిమార్గమునైయున్నాననియు బోధించుచు సర్వజనులను పిలుచుట వలనను 3) అద్భుత క్రియలు చేయుటవలనను 4) సైతానును, దయ్యములను, పాపములను, వ్యాధులను, శ్రమలను, శత్రుత్వమును, మరణమును పాతాళ లోకమును

జయించుటవలనను, తాను దేవుడనియు, రక్షకుడనియు ఋజువు పరచుకొనెను, అయినను యూదులలో కొందరు దుష్టులాయనను గ్రహింపలేక యూదుల మతమును ధ్వంసము చేయ వచ్చినాడని చెప్పి సిలువవేసి చంపిరి. ఆయన లోకభారము యెత్తికొన్నందున లేచి మోక్షలోకమునకు వెళ్ళెను. వెళ్ళకముందు తన శిష్యులకేమి చెప్పెను? 1. నేను మరల వచ్చెదను 2. పరిశుద్ధాత్మను మీకు పంపెదను 3. మీరు సర్వలోకమునకు వెళ్ళి నా సంగతులు బోధించుడి. నమ్మినవారికి మోక్షము నమ్మనివారికి శిక్ష (మత్తయి 28:19,20). ఈయనకే యేసుక్రీస్తు అనిపేరు. రక్షించు పనికి ఏర్పాటైన పురుషుడని యీమాట కర్ధము, క్రీస్తు చరిత్ర పాతనిబంధనలో ప్రవచన రూపమునను, క్రొత్త నిబంధనలో వృత్తాంత రూపమునను గాన వచ్చును. ఇది నాలుగు సువార్తలలో నున్నది.

నేనే లోకరక్షకుడను, నేనే లోకరక్షకుడను యని అనేకులు తమ్మును గురించి చెప్పుకొనవచ్చును. లేదా ఒక మహా మహోపకారిని చూచి ఈయనే రక్షకుడని ప్రజలు భ్రమింపవచ్చును. అందుచేత ఆయన వచ్చినప్పుడు యీయనే అని గుర్తుపట్టుటకు దేవుడు పాతనిబంధనలో వ్రాయించిన ఆనవాళ్ళలో కొన్ని ఇవి:-

1. ఆయన రాకముందొక రాయబారి వచ్చును మలాకీ 3:1; యెషయా 40:3. నెరవేర్పు : మత్తయి 3:3.

2. ఆయన కన్యకా గర్భమున జన్మించును. యెషయా 7:14. నెరవేర్పు: మత్తయి 1:18-25; లూకా 2:1-7.

3. ఆయన బేత్లెహేములో పుట్టును. మీకా 5:2; నెరవేర్పు : లూకా 2:5.

4. యూదులుకాని యితరులు దూరదేశమునుండి వచ్చి ఆ బాల రక్షకునికి బంగారము మొదలగు కానుకలర్పింతురు యెషయా 60:6. నెరవేర్పు : మత్తయి 2:1,21.

5. ఆయన శిశువుగా నుండునప్పుడు ఆయనను చంపవలెనని ఆదేశరాజు తత్ప్రాంతమందలి శిశువులను వధించును. యిర్మీయా 31:15. నెరవేర్పు : మత్తయి 2:26.

6. (ఆయన నరరూపధారి గనుక) దైవాత్మాభిషేకమొందును. యెషయా 61:1; నెరవేర్పు : మత్తయి 3:13–17.

7. ఆయన సువార్త ప్రకటించును. యెషయా 61:1,2; నెరవేర్పు : మత్తయి 5,6,7 అధ్యాయములు. లూకా 4:18.

8. ఆయన బీదలకు గూడ వినిపించును (గొప్పవారు, అధికులకేగాని బీదలకు ధర్మోపదేశము చేయగలదా) యెషయా 61:1; నెరవేర్పు: లూకా 4:18.

9. ఆయన రోగులను స్వస్థపరచును. యెషయా 53:4; నెరవేర్పు : మత్తయి 8:17.

10. ఆయన గార్ధభాసీనుడై యెరూషలేములో ప్రవేశించును. ఇది సమాధానమునకు గుర్తు. రాజులు గుర్రములెక్కి ప్రవేశింతురు ఇది యుద్ధమునకు గుర్తు. జెకర్యా 9:9; నెరవేర్పు : మత్తయి 21:1–11 యూదులు గ్రహించుటకిదియె స్పష్టమగు వృత్తాంతము.

11. ఆయన మన పాపములను పాపఫలితములను శిక్షను భరించును. మరణమొంది భూస్థాపితుడగును కీర్తన 22; యెషయా 53 అధ్యా॥లు. నెరవేర్పు : మార్కు 15వ అధ్యాయము.

12. ఆయన పునరుత్థానుడై మోక్షారోహణుడగును. కీర్తన 41:10. నెరవేర్పు : లూకా 24:50–53; కార్య. 1:9–11.

# 10వ ప్రకరణము

## క్రైస్తవ మత సంఘకాలము

యేసుక్రీస్తు వారికి పూర్వమున్నది యూదుల మతము. ఆయన ఆరోహణమైన తరువాత ఆయన జీవిత చరిత్రనాధారముచేసికొని ఆయన శిష్యులు స్థాపించినది క్రైస్తవమతము. మత్తయి 28:18-20; కార్య. 2:41; 11:26. 1పేతురు 4:16; కార్య. 16:17; 18:25,26; 19:19; 24:14,15; యెషయా 30:21.

## పెంతెకొస్తు

క్రీస్తు శిష్యులు ప్రార్థనలో నుండగా పరిశుద్ధాత్మ వారిమీద వ్రాలెను. అప్పుడు వారు శక్తినొంది వెంటనే అన్ని భాషలలో క్రైస్తవ మతము భోధించిరి. క్రీస్తు శిష్యులకు క్రైస్తవులనియు, మత ప్రవేశార్థమైన నీళ్ళతో యిచ్చు స్నానాచారమునకు బాప్తీస్మమనియు, పరిశుద్ధాత్మ అనగా దైవాత్మ విశ్వాసియొక్క హృదయమును నావరించుకొనుట పరిశుద్ధాత్మ బాప్తిస్మమనియు, ఆత్మ కుమ్మరింపనియు అందురు.

## క్రైస్తవ సంఘాదికాలము

వారు బోధించినది క్రీస్తుమతము. ఆదిని ఎంతో బాగుగానుండెను. వారు యేకముగా కూడి తమకు కలిగినదంతయు సమిష్టిగా నుంచుకొనువారు. ప్రతిదినము ప్రార్థన పెట్టుకొనువారు. అందరును ఒక్కమాటమీదనే నడుచుకొనువారు. వారి జీవనము మహా పవిత్రమైనది కార్య. 2:42-47.

## హింసకాలము

క్రైస్తవులకు హింసలు కలిగినందున పాలెస్తీనా విడిచిపెట్టిరి. అందువలన మతము ఆయాదేశములకు వ్యాపించెను. సైతానొకటి తలంపగా దేవుడొకటి తలంచెను. కార్య. 8:1-3 కథ యింతవరకే బైబిలులోనున్నది. అక్కడనుండి సంఘ చరిత్రలో నున్నది దీని శేషము మిషనుల చరిత్రలో నున్నది.

## తర్కకాలము

హింసలవలన క్రైస్తవులు లొంగలేదనియు వారు వ్యాపించు చున్నారనియు, సైతాను క్రైస్తవులలో క్రైసవులకు మతవాదము పెట్టెను. గనుక సంఘములో బేధములు పుట్టెను. అందువలన వాదప్రియులు మతపరిశీలన చేయగలిగిరి.

## అంధకార కాలము

కొన్నాళ్లకు మతగురువులే బైబిలను మత గ్రంథమును దాచిపెట్టినందువలన సంఘము అజ్ఞానంధకార స్థితిలోనికి వెళ్లెను. గాని దేవుడు లూథరును పంపి బైబిలును బైటకు తీయించెను. లూథరునకు చాలమంది సహాయకారులుండిరి.

# 11వ ప్రకరణము

## మిషనుల కాలము

పండితులు బైబిలును ఆయాభాషలలోనికి మార్చనారంభించిరి. ఈ పని దేవుడు సర్వలోకముతో మాట్లాడుపని. గనుక మిగుల గొప్ప పని. క్రైస్తవులు బైబిలును నానా విధములుగా అర్థము చేసికొనుటను బట్టి. మతము అనేక మిషనులుగా చీలిపోయెను. బైబిలునుబట్టి కాదు

అందరిదగ్గరనున్న బైబిలు ఒక్కటే సంఘము దర్శనవరము పోగొట్టుకొన్నందున అభిప్రాయబేధము సంభవించెను. నేటికి బైబిలు సుమారు 1200 భాషలలోనికి తర్జుమా అయినది ఏ మత గ్రంథమును యిన్ని భాషలలోనికి రాలేదు. బైబిలు, సర్వలోక గ్రంథమనుట కిదియొక నిదర్శనము. అన్ని మిషనులవారు బోధలలో బేధించినను క్రీస్తే లోకైక రక్షకుడని బోధించుచున్నారు.

## గురుతుల కాలము

జరుగబోవు వృత్తాంతములకు పూర్వమొక విధముగా జరిగిన వృత్తాంతములను ముంగుర్తులందుము.

భావికాలమందు జరుగవలసినవి దైవజ్ఞులకు దర్శనమందు కనబడగా అవి వారు గ్రంథమందు లిఖించిరి. ఇవి ప్రవచన రూపమున నున్నవి చదువరులివి యెప్పుడు జరుగనా యని కనిపెట్టుచుందురు.

## రాకడకు ముందు జరుగు గుర్తులు

1. ఇనుప పరిపాలన వచ్చుట దానియేలు 2:40.

అన్యరాజ్యములు యేలవలసిన కాలములోని మన కాలమునకు ఇనుపరాజ్యకాలమని పేరు ఇదే రాకడకు ముందున్న చివరికాలము (యూదులు కాని రాజుల రాజ్యముల కాలమునకు అన్యరాజ్యముల కాలమని పేరు) దీనినే రోమారాజ్యమందురు. ఇది రెండు పాదములు. అనగా తూర్పు రాజ్యము, పడమటి రాజ్యము యని రెండు భాగములు ఇది పది వ్రేళ్ళు అనగా పది ఉపభాగములు. ఇనుమును మన్నును కలిసి యుండలేవు (అట్లే యీ రాజ్యములో ఐక్యత యుండదు. ఇది మన కాలములో స్పష్టముగా కనబడుచున్నది).

2. అబద్ధ క్రీస్తులులేచుట. మత్తయి 24:5. క్రీస్తు కానివారై, నేనే క్రీస్తును అనగా నేనే లోకరక్షకుడను యని చెప్పుకొనువారు యీ

మధ్య నలువదిమంది వచ్చెదరు. అంతె క్రీస్తుయనగా క్రీస్తు విరోధి యింకను రాలేదు.

3. అనేకమంది అబద్ధ ప్రవక్తలు లేచుట మత్తయి 24:11. బైబిలు బోధకు వ్యతిరేకమైన బోధచేయువారు అబద్ధ ప్రవక్తలు. వీరు చాలమందియుందురు గాని అసలైన అబద్ధ ప్రవక్త యింకను రాలేదు. ఇతడును అంతెక్రీస్తును, సజీవులుగానుండు విశ్వాసులు, సంఘము శరీరముతో మోక్షమునకు ఎత్తబడిన తరువాత మహాశ్రమల కాలములో వచ్చును.
4. రాజ్యముమీద రాజ్యము లేచుటవలన యుద్ధములు జరుగుట. మత్తయి 24:4-7.
5. కరవులు సంభవించుట. మత్తయి 24:8.
6. భూకంపములు కలుగుట
7. తెగుళ్లు వ్యాపించుట లూకా 21:11. క్రొత్త క్రొత్త జబ్బులు లేచుచున్నవని వైద్యులు చెప్పుటలేదా!
8. ఆకాశమందు భయోత్పాతములు కలుగుట. లూకా 21:11-25. జ్యోతులలోకనబడు చిత్రాంశములను గురించి జ్యోతిష్కులు ప్రచురించుటలేదా!
9. భూమిమీద సముద్ర తరంగముల ఘోష కలుగుట. లూకా 21:25. వివిధ కష్టములవలన భూమిమీద ఆంధోళన కలుగుట లేదా! ఓడలు ముంచివేయబడుట వలన సముద్రము మీద ఘోష కలుగుటలేదా!
10. క్రీస్తు విశ్వాసులకు హింసలు సంభవించుట. మత్తయి 24:9.
11. క్రీస్తు విశ్వాసులు సకల జనములచేత ద్వేషింపబడుట. మత్తయి 24:9; మార్కు 13:9.

12. అక్రమము విస్తరించుట. మత్తయి 24:12; 1థెస్స 2:3; 2తిమోతి 3:1-5.

13. పనులు దొరకకపోవుట. జెకర్యా 8:10.

14. యూదులు శిక్షను యనుభవించుట. యూదులు దేవుని వలన జన్మార్థ జనాంగముల యేర్పరుపబడిన వారైనను దైవాజ్ఞల నతిక్రమించిన యెడల శిక్ష నొందుదురని లేవి 26 అధ్యా॥లో దేవుడు చెప్పిన వాక్యములు నెరవేరుట. ఇవి మన కాలములో నెరవేరుచున్నవి గదా! దీనిలోనున్న ముఖ్యమైన సంగతి ఏమనగా వ్యాధులు, పంటనష్టము, శత్రుబాధలు, పట్టణ నాశనము, పరవాసము, ఖడ్గబాధ యీ మొదలగునవి.

15. పాలెస్తీనా యూదులదగుట పాలెస్తీనా యూదులదగునని దేవుడిచ్చిన వాగ్దానము ఆది 15:17-21 లో నున్నది, ఇది ఇంగ్లీషు వారిద్వారా నెరవేర నారంభించినది.

16. యూదులు పాలెస్తీనాకు తిరిగివచ్చుట. నెహెమ్యా 1:9; యెహెజ్కేలు 36, 37, 38 అధ్యాయములు.

17. భ్రష్టత్వము కలుగును. 1తిమోతి 4:3-4.

18. బైబిలు ప్రవచనములు అర్థములు అనేకులకు బయలుపడుట దానియేలు 12:4-9.

19. రాకడ సంగతులు తెలిసినను ఆ దినముకూడ ఎవరిపనులలో వారుండుట. మత్తయి 24:37-39; లూకా 17:26-30.

20. లోకస్తులందరికి ధైర్యము చెడిపోవుట. లూకా 21:2-28. నేటి ఆపదలు అందరిని బెదిరించుచున్నవి.

21. శాంతి, నిరీక్షణ భంగమగుట. యిర్మీయా 6:14. ప్రత్యేకముగా రెండవ రాకడకై యీ దిగువ గుర్తులు జరుగునను వివరము

లేకపోయినను నేటి వృత్తాంతమును బట్టి యివియు గుర్తులే అని గ్రహించుకొనుచున్నాము.

22. ధనరాశి యెక్కువగుట. యాకోబు 5:1-10.

23. విమానములు వచ్చుట. యెషయా 31:5; 60:8. 1917వ సం॥ము యెరూషలేము ఇంగ్లీషువారి స్వాధీనమైనప్పుడు పట్టణము మీద తిరిగిన బ్రిటీషు విమానములు యెషయాకు దర్శనములో గూటి పిల్లలను కాపాడు పక్షులవలె కనబడినవి (క్రీ॥పూ॥ 713).

24. బస్సులు వాడుకలోనికి వచ్చుట. నహూము 2:4. (మన కాలములోని బస్సులను నహూము రథములనుచున్నాడు క్రీ॥పూ॥ 713).

25. మెస్సియా అనగా క్రీస్తుప్రభువు రానైయున్న సమయమున ఒక పుష్పము పుట్టును అని టాల్మడ్ అనుయూదల గ్రంథములో ప్రవచన రూపముగా వ్రాయబడి యున్నది. ఆ వ్రాతకు నెరవేర్పుగా మనకాలములో పాలెస్తీనా దేశమునందు ఆ పువ్వు మొక్క పుట్టినది. దానికి హెబ్రీ భాషలో ట్సెలాప్ అందురు.

ఈ పువ్వు మొక్క రాత్రులు పుట్టును, ఆకులు వేయును, ఉదయమున మొగ్గలేచును, మధ్యాహ్నము పుష్పము కనబడును.

ఇంకను మరికొన్ని గురుతులున్న యెడల అవి కాలక్రమమున వెల్లడియగును.

# రాకడకు సిద్ధపడుట యెట్లు?

1) వి = వినుటవలన. అనగా చరిత్ర అంతయు పూర్తిగా నేర్చుకొనవలెను. 2) వి = విశ్వసించుటవలన. అనగా విన్నదంతయు నిజమని మనుస్సలో నమ్ముటవలన. 3) వి = విధేయులగుటవలన

అనగా దైవాజ్ఞలన్నిటికి విధేయులై నడుచుకొనుటవలన. 4) వి = విమలాత్మాభిషేకము వలన. అనగా క్రీస్తు యిచ్చు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుట వలన. ఇది ప్రార్థన విశ్వాసమువలనను, కనిపెట్టుటవలనను లభించును. (నీళ్లుగల బాప్తీస్మము ఆత్మీయ జీవనముయొక్క జన్మమునకు సంబంధించినది పరిశుద్ధాత్మ బాప్తీస్మము ఆ జీవనముయొక్క మహావృద్ధికిని, సేవకవసరమైన వరములతో గూడిన శక్తికిని సంబంధించినది దైవాంశ ధ్యానకాలమున అంతరంగమునకు స్ఫురించు నిదర్శనమే గొప్ప గుర్తు ప్రయత్నించండి.

గుర్తులైన తరువాత ప్రభువు రాకపోయిన యెడల మరియెప్పుడు వచ్చును?

ఆయన యెప్పుడు వచ్చినను యిప్పుడే యని నమ్ముట మన విధి. ఇట్లు నమ్ముటవలన హానిలేదుగదా! రాకడ నిశ్చయత వివరముగా బోధింపని క్రైస్తవులు అబద్ధ ప్రవక్తలుకాక మరి యెవరు?

## నవీన కాల సంఘము

క్రీస్తు, పూర్వము లవొదికయ పట్టణ సంఘమునకు వెలుపల యుండినట్లు నేడును ఆచారములతోను, నామకార్థమైన ఆరాధనలతోను, జీవములేని కారణముగా గల సువార్త సేవలోను, మిషనుల బేధములవలన పోరాటములతోను, నిండియున్న బాహ్య సంఘమునకు వెలుపల నున్నాడు. గాని అన్ని మిషనులలోని విశ్వాసుల హృదయములలో నుండక మానడు. నేడు రాకడ బోధ వ్యాపించినందున విశ్వాసులలో సహితము రాకడ సందేహము కలుగుచున్నది. కొందరు విశ్వాసులు క్రీస్తు చరిత్ర నమ్మినను క్రీస్తు సామీప్యాంశము నమ్ముటలేదు. ఆయన యెప్పుడు బడితే అప్పుడు వచ్చును. గనుక మనమును యెప్పుడు బడితే అప్పుడు సిద్ధముగా నుండవలెను. ప్రకటన. 3:20.

## భావికాల విషయములు

ఇదివరకు నున్న పుటలోని సంగతులు జరిగిపోయినవి. ఇప్పుడు వచ్చు పుటలలోని సంగతులు యికముందు జరగవలసిన సంగతులైయున్నవి.

# 12వ ప్రకరణము

## సంఘము ఎత్తబడుట

క్రీస్తు యేసు మోక్షమేఘముమీద వచ్చునప్పుడు యిదివరలో క్రీస్తునందు మృతులైన విశ్వాసులు ఆ మేఘములోనికి వెళ్లుదురు. సజీవులుగా నున్న విశ్వాసులు మరణములేని భాగ్యమొందినవారై మహిమ శరీర ధారులుగా ఆ మేఘములోనికి వెళ్లుదురు. పాపమెరుగని శిశు వులుకూడా ఎత్తబడుదురు. ఎత్తబడు సంఘము పరలోకములోని మహోన్నత స్థలమగు నూతన యెరూషలేమునకు వెళ్ళును. ఈ సంఘమునకే పెండ్లికుమార్తె సంఘమను బిరుదు కలదు. ఈ మాట లోకములో మనమువాడు మాట వంటిది కాదు.

## వెళ్ళిన కన్యకలు

1) దివిటీలు పట్టుకొనిరి, 2) ఎదుర్కొన వెళ్ళిరి, 3) కన్యకలై యుండిరి, 4) నిద్రపోయిరి, 5) అర్ధరాత్రి కేక వినిరి, 6) లేచిరి, 7) దివిటీలు చక్కపరచుకొనిరి మత్తయి 25వ అధ్యా॥ము.

## వెళ్ళని కన్యకలు

1) దివిటీలు పట్టుకొనిరి 2) ఎదుర్కొన వెళ్ళిరి, 3) కన్యకలై యుండిరి, 4) నిద్రపోయిరి, 5) అర్ధరాత్రి కేక వినిరి, 6) లేచిరి, 7) దివిటీలు చక్కపరచుకొనిరి. మత్తయి 25వ అధ్యాయము.

షరా:- ఈ ఏడు సంగతులు ఈ రెండు గుంపుల కన్యకలలోను కనబడుచున్నవి కాని రెండవ గుంపువారికి క్రీస్తుయెడల ప్రేమ రవ్వంత తగ్గినది గనుక అట్టివారు యెత్తబడరు మత్తయి 24:12.

షరా:- 1) ప్రభువు మొదటి రాకడ పాత నిబంధనలో నున్నట్లు నమ్మువారు విశ్వాసులు. 2) ప్రభువు జన్మచరిత్రను నమ్మువారు విశ్వాసులు. 3) ఆయన పవిత్ర జీవితమును నమ్మువారు విశ్వాసులు. 4) ఆయన బోధ నమ్మువారు విశ్వాసులు. 5) ఆయన శ్రమపవిత్రతను నమ్మువారు విశ్వాసులు. 6) ఆయన మరణ చరిత్రను నమ్మువారు విశ్వాసులు. 7) ఆయన పునరుత్థాన చరిత్రను నమ్మువారు విశ్వాసులు, 8) ఆయన ఆరోహణ చరిత్రను నమ్మువారు విశ్వాసులు.

షరా:- ఇన్నియు నమ్మిన విశ్వాసులు రాకడ నమ్మనియెడల యెట్లు రాకడ విశ్వాసులు కాగలరు? రాకడ విశ్వాసులు కానియెడల యెట్లు ఎత్తబడగలరు?

షరా:- రాకడ వాక్యములు నేర్చుకొననివారు యెట్లు రాకడ విశ్వాసులు కాగలరు? యోహాను 14:2-4; 1థెస్స. 4:13-18.

# 13వ ప్రకరణము

## మహాశ్రమ కాలము

ఈ కాలచరిత్ర ప్రకటన 6:3లో ఆరంభమైనది. మొదటి రెండు వచనములలో యున్న చరిత్ర శ్రమకాలారంభమునకు ముందు జరుగు చరిత్ర. పెండ్లికుమార్తె సంఘము ఆరోహణముకాగా మారిన వారిని రక్షించుటకు క్రీస్తుప్రభువు వచ్చునని 6:3 భావమైయున్నది, శ్రమకాలమగు యేడేండ్ల కాలమున ఆయన ఆరోహణ భక్తులతో కలసి దేవలోకమున విందులో నుండునుగాని, శ్రమలో మారినవాని రక్షించుటకు మధ్యమధ్యను వచ్చుచునే యుండును. ఆయన సర్వవ్యాపిగదా! ఈ

భావము ప్రకటనలోని గుఱ్ఱములను గూర్చిన దర్శనమువలన గ్రాహ్యమగుచున్నది. అప్పుడు భూమిమీద నామక క్రైస్తవులును, యూదులును, చాలమంది అన్యులును మిగిలియుందురు. అంతెక్రీస్తు తన యేడేండ్ల పరిపాలన ఆరంభించును దానియేలు 9:27.

**1. అంతెక్రీస్తు:–** ఇతడు మనకాలములో యింకను రాలేదు. పెండ్లికుమార్తె వెళ్లిపోయిన తరువాత వచ్చును. ఇతడు సైతానుయొక్క లక్షణములను, చాకచక్యమును, శక్తులను అధికారమును కలిగియుండును. సర్వవిద్యలు యెరిగినవాడు, జనమును వశీకరణ చేసికొనగల రూపము వాక్కులు గలవాడు, భూలోక రాజ్యములమీదను, వర్తక వ్యాపారముల మీదను, ధనాగారముల మీదను, స్వాతంత్ర్యాధికారము గలవాడు. మిగుల తెలివితేటలు కలిగి ప్రవర్తించువాడు గొప్ప ఉపాయ శాలి ప్రక. 13:1-10.

**2. అబద్ధ ప్రవక్త:–** ఇతడు యింకను రాలేదు. పెండ్లికుమార్తె ఎత్తబడితేనేకాని రాడు. ఇతడు అంతిక్రీస్తే లోకరక్షకుడని నచ్చజెప్పుటలో మహాదిట్ట ప్రక. 13:11.

**3. మూడు దయ్యములు:–** ఇవియు అంతిక్రీస్తు పక్షముగా అద్భుతములు చేసి ప్రజలను భ్రమ పెట్టును (ప్రక. 16:13).

**4. మొదటి శ్రమలు:–** క్రీస్తును నమ్మినవారికే శ్రమలు. అంతిక్రీస్తు ముద్ర వారికుండదు గనుక వారికి సరుకు అమ్ముడుకాదు. ప్రజలను తన పక్షము చేసికొనుటకును, వారిని దేవునియొద్దకు వెళ్ళకుండ ఆపుచేయుటకును, అంతిక్రీస్తు హింసలు కలుగజేయును. ఏడేండ్ల శ్రమల వివరము మనము వినలేము. మన చెవి సహింపనేరదు మత్తయి 24:20 ప్రజలు చావుకోరుకొనినను చావు దొరకదు.

**5. రెండవ శ్రమలు:–** ఇవి సృష్టిద్వారా కలుగును. ఎండ వేడిమి, భూకంపములు, కరువులు, అడవి మృగముల బాధలు ఇవి

అంతిక్రీస్తువలన కలుగవు. అతనికి సృష్టిమీద అధికారములేదు. నరుల పాపములవలననే కలుగును, ప్రజలు శ్రమలయందు తనతట్టు తిరిగి రక్షింపబడవలెనన్న కోరికతో దేవుడు శ్రమలు రానిచ్చును.

**6. సమాజము:-** లోకవాసులను అంతిక్రీస్తు తట్టు త్రిప్పుటకొక సమాజమేర్పడును. దీనికే స్త్రీ అను బిరుదు గలదు. ఈ స్త్రీ సాంగత్యము చేయని నూట నలుబది నాలుగు వేలమంది యూదులు యేసుక్రీస్తు ప్రభువే తమ మెస్సియా అనగా రక్షకుడని గ్రహించి అంగీకరించి రక్షింపబడుదురు. పూర్వము యూదులేగదా ఆయనను సిలువవేసి చంపినది ఇన్నాళ్ళకీ యూదుల జనాంగము క్రీస్తు ప్రభువును ఆశ్రయించును. కోటానుకోట్ల అన్యులును రక్షింపబడుదురు. అనేకులు ప్రభువు తట్టు తిరుగరు.

## హర్మగెద్దోను యుద్ధము

శ్రమకాలాంతమున క్రీస్తునకును, అంతిక్రీస్తునకును, హర్మగెద్దోను నొద్ద యుద్ధము జరుగును. అంతిక్రీస్తును, అతని సైన్యములో చేరిన క్రీస్తు విరోధులను ఈయన వచ్చుటచూచి గజగజ వణకుదురు. ఆ సమయమందే క్రీస్తుభక్తులు ప్రార్థనచేయగా భూకంపము వలన కలుగు లోయవారికి ఆశ్రయ స్థానమగును. క్రీస్తు యొక్క ప్రభావమువలననే అంతిక్రీస్తు సైనికులు హతులగుదురు. అప్పుడు క్రీస్తు అంతిక్రీస్తును, అబద్ధ ప్రవక్తను, దయ్యములను పట్టుకొని నరకాగ్ని గుండములో పడవేయును, గాని వారి అధికారియగు సాతానును పాతాళములో బంధించును. దీనికే మట్టులేనిగొయ్యి అందురు. ప్రకటన 20 అధ్యా॥ అక్కడతడు వెయ్యేండ్లుండవలెను, ఇది అతడు మారుటకొక మంచి గడువు (మారునా?)

షరా:- హర్మగెద్దోను పాలెస్తీనాలోని యెరూషలేమునకు ఉత్తరమున నున్నది. అక్కడ యీ యుద్ధము జరుగనైయున్నది. గనుక అది నేడు ఖాళీగా నున్నది (ప్రక. 16:14-16).

# 14వ ప్రకరణము

## వెయ్యేండ్ల పరిపాలన

## (మారిన భూమి)

క్రీస్తుప్రభువును, నూతన యెరూషలేము సంఘమును భూమిమీదికి వచ్చి మారిన యెరూషలేమును ప్రధాన పట్టణముగా చేసికొని, సర్వలోకమును వెయ్యేండ్లు యేలుదురు ఇది పాలెస్తీనాలోని యెరూషలేము.

గమనిక:- **1) పవిత్రత:-** పాపము చేయించు సైతానును, అంతిక్రీస్తును, అబద్ధ ప్రవక్తయు నుందరు గనుకను అవిశ్వాసులు గతించిపోయిరి గనుకను శ్రమకాలములో భూమిమీద యావత్తు కళంకము తుడిచివేయబడినది గనుకను భూమి పవిత్రముగా నుండును గాని శేషించిన ప్రజల హృదయములలో పాపనైజముండిపోవును.

**2) మతోపదేశ కార్యము:-** పరలోకమునుండి వచ్చిన వారు అన్ని భాషలలో మాట్లాడగలవారై మహిమ శరీరధారులగుట చేత నిరాటంకముగా భూ సంచారముచేసి, క్రీస్తు మతమును పూర్తిగా మనోహర వాక్యముతో ప్రతివానికి ప్రకటింతురు. నేటి క్రైస్తవుల బోధ పూర్తిగాలేదు, అందరికిని అందుటయునులేదు.

**3) ప్రసంగీకుల జీవితము:-** ఇది అద్భుతకరమైన పవిత్రత కలిగియుండును (నేటి క్రైస్తవుల ప్రవర్తనలో లోపములున్నవికదా).

**4) దైవారాధన:-** ఇదొక అద్భుత క్రియ, దీనిలోని ఉపదేశము, పాటలు వర్ణింప వీలులేదు. ఇది చూచుటకై భూదిగంతములనుండి అనేకమంది యెరూషలేము వెళ్ళుదురు. ఆ కాలమందు గాలియోడలు మొదలైనవి మెండుగా నుండును గనుక ప్రయాణములు సుళువు.

**5) భూస్థితి:–** ధూళిలేని నీళ్ళు, పంటలు, పండ్లు, పువ్వులు, వృక్షాదులు మహాసమృద్ధిగా నుండును. చెట్లకు పురుగుపట్టదు, ఫలింపని నేలయుండదు. జీవరాసులకు, నరులకు గొప్ప మైత్రియుండును, వాటికి హానిచేయు స్వభావమే యుండదు.

**6) నరులు:–** పోట్లాటలు, యుద్ధములు, కరువులు, భూకంపములు, జననష్టము, వరదలు, విషపురుగులు, విగ్రహారాధన, కులము ఇవి నరులెరుగరు. మరణములు మిగుల అరుదు. ప్రజలు వందలాది ఏండ్లు బ్రతుకుదురు. పరిపాలన క్రీస్తుది గనుక విశ్వాసులును, అవిశ్వాసులును సుఖింతురు. అనేకులు దేవునితట్టు తిరుగుదురు. పన్నులుండవు (మత్తయి 24 అధ్యా). ప్రతివాని మోకాలు యేసు నామమున వంగును యని ఫిలిప్పీ 2:9–11లో నున్నందున ఇతర మతములుండవని అగుపడుచున్నది. తన సర్వలోక రాజ్యములు తీసుకొను క్రీస్తుపాలన ధర్మపరిపాలన, నీతి పరిపాలన, మహాశాంతి పరిపాలన కాబట్టి నరులకును, జీవరాసులకును, భూమికిని సృష్ట్యాది స్థితియే మరల కలుగును, మహానందముగా నుండును ప్రక. 1:15; యెషయా 2:1–4; 11అధ్యా. 66, 65 అధ్యా. జెకర్యా 8:4,5; మీకా 4 అధ్యా॥ ఎఫెసీ 1:10; కొలస్స 1:20.

## సజీవుల తీర్పు

వెయ్యేండ్లు మతబోధ విన్నవారు ఏమి తీర్మానించుకొన్నారో ఆలకించి తీర్పు విధించుటకు క్రీస్తు యీ భూమిమీద సింహాసన మేర్పరచుకొనును, ఈ తీర్పునకే సజీవుల తీర్పు అని పేరు మత్తయి 25:31–46.

## సైతాను విడుదల

ఈ వెయ్యేండ్ల చెరసాలలో నున్న సైతానును యిప్పుడు క్రీస్తు విడిచిపెట్టును విడుదలైనందుకు అతడానందిపక మహారౌద్రాకారముతో

భూమిమీదకు వచ్చి తన పక్షముగా నున్నవారిని ఒక సైన్యముగా సమకూర్చుకొని దేవునిమీదికి యుద్ధము చేయవెళ్ళును. వెయ్యేండ్లలో మారిన భూమియొక్క కళను, పరిశుద్ధుల కాంతిని, దైవారాధనలోని తేజస్సును, మతబోధ ప్రభావమును చూడలేక మూలమూలను దాగియున్న వారు సైతాను పక్షముగా నున్నందున దేవుడు సైతానుకు భూమిమీద రాసెలవిచ్చెను. వారు లేకపోయిన యెడల సెలవియ్యడు, సైతానును బంధించివేయుమని నరులేకాలమందైనను ప్రార్థించిన యెడల దేవుడు అతనిని తప్పకుండ బంధించియుండును గాని నరులట్లు చేయరు. సైతానుయొక్క సైన్యముమీద అగ్ని కురియగా అది నాశనమగును. క్రీస్తు అతని పట్టుకొని నిత్య నరకాగ్ని గుండములో వేయును. ఇది వెయ్యేండ్ల చివర జరుగును. ప్రక. 20:7-10.

## అంత్య తీర్పు

భూలోకము పుట్టినది మొదలుకొని నాటివరకు సమాధులలో యున్న అవిశ్వాసులను క్రీస్తు పిలిచి, భూమి పాతాళము మోక్షములేని చోట తీర్పు వినుపించును ఈ తీర్పునకు క్రీస్తు తప్ప యితరులెవ్వరును వెళ్ళరు. ఇది వెయ్యేండ్ల చివర జరుగును (ప్రక. 20:11-15).

## క్రొత్త భూమ్యాకాశములు

1) తర్వాత భూమిమీద మిగిలిపోవు విశ్వాసులు భూమిమీదనే యుండి పోవుదురు. భూమి మోక్షములో ఒక భాగమైయుండును. 2) నూతన యెరూషలేములో పెండ్లికుమార్తె ఉండును. 3) వేరొకచోట రక్షింపబడిన వారుందురు. ఈ మూడు లోకములలో క్రీస్తు వారివారి కాంతినిబట్టి వారియొద్ద నుండును ప్రక. 21:11.

# 15వ ప్రకరణము

## 1. మిత్ర నేర్పు కొన్ని పాఠములు

దేవుడు కలడు గనుక చెడుగు మానవలెను. లేనియెల ఆయన శిక్షను రానిచ్చును. దేవుడు కలడు గనుక మంచి ననుసరించుము. అందువలన నీకాయన బహుమానమిచ్చును. నీ విషయములన్నియు చూడగల అధికారులందరికంటె ఒక గొప్ప అధికారి నీపైన యున్నాడని మరువకుండు.

2. మిత్రుడా! ఆయన నిన్ను అనాదిలోనే తలంచుకొనెను ప్రేమించెను, నీ సదుపాయములాలోచించెను. ఇది పాపశ్రమలో వాసివగు నీకాదరణకదూ! స్తుతించుము.

**3. దైవలక్షణములు:–** తన లక్షణములను నరులకనుగ్రహించిన దేవుని లక్షణమెంత లక్షణముగా నున్నదో ఆలోచించుకొనుము. కృతజ్ఞత గలిగియుండుము, వాటిని యుపయోగించుకొనుము.

**4. దూతలు:–** నీకాపద రాకుండ కాపాడగల మిత్రులను భటులునగు దేవదూతలను కలుగజేసిన తండ్రికి నీ విషయములో యెంత శ్రద్ధ! వారికెంత అభిమానము! ఆనందించుము. నిర్భయముగ నుండుము.

**5. సైతాను:–** పవిత్రసృష్టియైయున్న ఒక దేవదూత దేవుని ఎదిరించినప్పుడు నాశనముచేయని దేవునికెంత ఓపిక! నరులిన్నాళ్ళ నుండి అనేక పాపములు చేయుచున్నను సహించుచున్న దేవుడెంత గొప్ప అంతస్తు గలవాడో చూడుము. మారుటకందరికి చాలా గడువు ఇయ్యవలెనని ఆయన కోరిక. ఎప్పటికిని నరులు మారనియెడల యెవరపరాధులు? దైవజ్ఞానం విడువకుము.

**6. సర్వలోక సృష్టి:-** నరులను కలుగజేయక ముందు వారికవసరమైన సమస్తమును ఒక క్రమము ననుసరించి సమృద్ధిగా సృజియించిన దేవుని జ్ఞానమెంత మెచ్చుకొనదగినది! ఎప్పుడైన మెచ్చుకొన్నావా? కొదువలేని లోకములో యిబ్బందిపడుచున్న మనమెంత మంద భాగ్యులము!

**7. పాపము రక్షణ:-** నరులు పాపములో పడగానే దేవుడు వారిని పలకరించి రక్షించెను. ఇది కుమారుడు జబ్బుపడగానే తండ్రి ఔషదము తెచ్చినట్టున్నది. దేవుడెంత క్షమార్పణశాలి! ఎంత కాలోచిత రక్షణకర్త! నీవొక తప్పిదములో పడగానే, నిన్ను రక్షించుటకు ఆయన నీయొద్ద సిద్ధముగా నుండును. ఎప్పుడైనా గుర్తించినావా? గుర్తించుము. అప్పుడు నిన్ను నీవు దిద్దుకొనగలవు.

**8. నిరీక్షణ:-** దేవుడు వాగ్ధాన దేవుడు. వాగ్ధానము నరులయందు దైవ బహుమానము యెడల శ్రద్ధాసక్తిని వృద్ధిచేయును, దైవ విశ్వాసాభివృద్ధి కలిగించును. వాగ్ధాన సిద్ధికి పూర్వమనేక నూతన విషయములను నేర్పించుట వలన ఆనందానుభవము నుదయింప జేయును.

**9. నిశ్శబ్దము:-** అజ్ఞానము వలనను అవిశ్వాసము వలనను మన మనస్సును మనము కలత పరచకొనకునప్పుడు ఆయన చూచియు చూడనట్టు ఊరుకొనును. భక్తి జీవితాభ్యాసమును సంపూర్ణ స్థితి లభింపజేయుటకు నిశ్శబ్ద కాలమొక విపరీత సాధనమైయున్నది. ఇప్పుడే నరుడు తన శక్తులను సాధనముచేయును ఫలితమెంత ధన్యత!

**10. అవతారము:-** నరులను సంతోషపెట్టుటకును, వారి ఉపయోగార్ధమైన పనులన్నియు చేసిపెట్టుటకును, వారితో స్వయముగా మాట్లాడుటకును, వారికష్టములలో తోడ్పడుటకును, వారియొద్ద నివసించుటకును దేవునికెంతో యిష్టమని అవతారము వలన

కనబడుచున్నది. ఆయన వాత్సల్యోద్దేశ్యమును గురించి ఏమని వర్ణింపగలము.

**11. లోక జీవితము:-** మనము యీ పాపలోకము విడిచి దేవలోకమాయన యొద్దకు వెళ్ళగలందులకై సిద్ధపడుటకు దేవుడు ఈ లోకము ననుగ్రహించెను. నేను పిలుచువరకును నా మాటలు చదువుకొనుచుండుడి అని మతగ్రంథమును మనచేతిలో పెట్టెను. పాప విసర్జన చేయించుటకై శ్రమానుభవసాధన నేర్పరచెను. ధర్మ ప్రవర్తనభ్యసింప జేయుటకై ధర్మోపదేశకులను నియమించెను. మనలను భద్రపరచుటకు మత సంఘస్థాపనచేసెను. గ్రామాంతరమున నున్న విద్యార్థులకు పరీక్షలైన పిమ్మట తల్లిదండ్రులయొద్దకు వెళ్ళవలసిన దినము మహాదుఃఖ దినమా? ఈలోక పరీక్షలైన వెనుక విశ్వాసులకు మోక్ష లోకములోని దేవజనకుని యొద్దకు బోవలసిన మరణదినము మహాదుఃఖ దినమా? పాపముగాని పాపఫలితములుగాని లేని మోక్ష లోకమెంత గొప్పలోకము! ఇది చూచుకొని అది పోగొట్టుకొన వచ్చునా?

సత్యాసత్యములు తెలిసికొనగల జ్ఞానమును, మనస్సాక్షిని తెలిసికొని సత్యము అనుసరింపగల శక్తిని, దేవుడు నీకనుగ్రహించి యున్నాడు గనుక అధైర్యపడవద్దు నీ జ్ఞానమును మనస్సాక్షిని దైవప్రార్థన పూర్వకముగా సద్వినియోగ పరచుకొన్నయెడల సర్వకార్యములు సఫలమగును.

**12. క్రైస్తవమతము:-** క్రైస్తవ మతము దైవమతమనుటకు ఋజువులు.

**1**. బైబిలు 1) అరువది ఆరు పుస్తకములుగల యీ బైబిలు ఆయాకాలములలో ఆయాదేశములలో ఆయాభక్తులు దైవాత్మ ప్రేరేపణవలన వ్రాసిన గ్రంథము. వ్రాసిన వారికిగూడ అందని భావికాల విషయములిందుగలవు (2పేతురు 1:16-21). 2) వ్రాతలో బెట్టినవారు నరులేగాని బైబిలు గ్రంథకర్త దేవుడే 3) బైబిలు నేటికి సుమారు 1200

Bible Mission HQ Guntur

భాషలలోనికి అనగా మొత్తముమీద లోకములోనియన్ని భాషలోనికి వచ్చినందున యిది సర్వలోక గ్రంథమని కనబడుచున్నది. ఏ మత గ్రంథమును యిన్ని భాషలలోనికి రాలేదు. ఇది దేవుడు లోకమంతటికి పంపిన ఉత్తరము గనుక అందరును చదువవలెను (లిపిలేని ఎరుకల భాషవంటి భాష మాటలాడువారు తామున్న ప్రజలభాషలో బైబిలు విషయములు విందురు. మిషనెరీలు కొన్ని భాషలకు లిపి కల్పించిరి. 4) బైబిలులోని ముఖ్యాంశము లోకైక రక్షకుడగు యేసుక్రీస్తువారి చరిత్రయే: తక్కిన అంశములు యీ అంశము దరినేయుండును. బైబిలులో మొదటి భాగమగు పాత నిబంధనలో ఆయన వచ్చునని ప్రవచన రూపమును రెండవ భాగమగు క్రొత్త నిబంధనలో ఆయన వచ్చెనని వృత్తాంత రూపమును లిఖింపబడియున్నది. ఆయన సజీవ విశ్వాసజన సంఘమును తీసికొని వెళ్ళుటకు రానైయున్నాడను విషయముగూడ ప్రతిపాదింపబడియున్నది. బైబిలులోని పుస్తకములు ముఖ్యముగా క్రీస్తువారి కథయున్న సువార్తలు చదువుకొన్న వారికిని చదువులేనివారికిని బోధపడగల సులువైన మాటలలో వ్రాయబడియున్నవి. అందుచే బైబిలు అందరి బైబిలనుచున్నాము. ఒక దేశస్థులు చాల సంవత్సరముల వరకు విదేశీయులను రానీయనందున క్రీస్తుమతమువారికి తెలియలేదు. ఒకరికి మార్కు సువార్త దొరికినది. కొందదరది చదువుకొని బోధకుని సహాయము లేకుండనే క్రైస్తవ మతము స్థాపించుకొనిరి. గుడి కట్టుకొని ఆరాధన జరుపుకొనిరి.

**2. దైవారాధన చరిత్ర:-** దేవుడు ప్రపంచమునకు దర్శనమియ్యదలంచి యేసుక్రీస్తుగా జన్మించెను. జంతురూపముతో వచ్చిన యెడల నరులు కొట్టజూతురు. దేవదూత రూపముతో వచ్చిన యెడల భయపడి పారిపోవుదురు. నిజ ప్రభావముతో వచ్చినయెడల భస్మమైపోదురు. అయితే నరరూపముతో వచ్చినయెడల సత్కరింతురు. అందుచేత నరుడైపుట్టెను. అందరితో ధారాళముగా మాట్లాడెను. తన

ప్రభావముచేత వ్యాధిగ్రస్తులను అద్భుతమైన రీతిగా స్వస్థపరచుట వలనను, దయ్యములను వెళ్ళగొట్టుటవలనను; అన్నదానము చేయుట వలనను, ఆపదలను తొలగించుటవలనను, దివ్యోపదేశములు వినిపించుట వలనను, పాపక్షమాపణ అనుగ్రహించుట వలనను, మృతులను బ్రతికించుటవలనను, దేవుడెట్లుండునను ప్రశ్నవేయు నరజన సంఘమునకు క్రియాపూర్వకముగా సమాధానము చెప్పెను. దేవుడు నరుల తండ్రియనియు, నరుడు నరుల సోదరుడనియు తన బోధవలన తెల్పెను. పవిత్రముగా నడిచి చూపించెను. ఆయన సర్వలోక భారమెత్తుకొన్నందునను నరునికి బదులుగా వచ్చినందునను, నరుడు మోక్ష సంపాదన విషయములో చేయవలసిన పనులు చేసికొనలేడని చెప్పి ఆయనచేసి పెట్టినందునను, మహాశ్రమయు, సిలువ మరణమును పొందవలసి వచ్చెను. ఆయన యెంత దేవుడైనను మానవుడైనందున నరునికి బదులుగా యజ్ఞమై మృతినొంద గలిగెను. ఈ మృతివలన పాపజన సంఘ దుస్థితిని తొలగించెను. ఎంత మానవుడైనను దేవుడే గనుక మృతిని జయించి బ్రతికివచ్చెను. ఆయన నిత్యము మృతుడే అయియున్న యెడల యెట్లు రక్షణోపకారి కాగలడు? తన పునరుత్థానము వలన సుస్థితిని గడించిపెట్టును. నమ్మువారికి యీ రెండు ఉపకారములు అనగా దుస్థితి పరిహారమును, సుస్థితి సంపాదనమును కలుగును. పునరుత్థానమైన పిమ్మట విశ్వాసులకు ప్రత్యక్షమై మరికొన్ని ధర్మములు ఉపదేశించి మోక్షారోహణుడాయెను. ఆయన రెండవ మారు నేడో రేపో రానైయున్న కాలమువరకును, భూమిమీద తన సంఘముచేత సర్వలోక రక్షణ కార్యోపదేశము చేయించుచున్నాడు. తన వాగ్దాన ప్రకారము ప్రార్థన పరులయొద్దను, పనివారియొద్దనుండి వారికి తోడ్పడుచున్నాడు.

**3. అక్షర గణన:-** పాతనిబంధన వ్రాయబడిన హెబ్రీ భాషకు యిరువది రెండు అక్షరములు, క్రొత్త నిబంధన వ్రాయబడిన గ్రీకు భాషకు యిరువదియారు అక్షరములు. ఒక్కొక్క అక్షరమునకు ఒక్కొక్క అంకె

నియమింపబడియున్నది. బైబిలులోని అక్షరములన్నియు లెక్కింపబడి యున్నది ఒక్క అక్షరమైనను తీసివేయ వీలులేదు. బైబిలులో కావ్యభాగము మిగుల తక్కువ. వచన భాగమే చాల యెక్కువ పద్యములోని అక్షరము తగ్గింప వీలుండదుగాని వచనములోని అక్షరములు తగ్గింప వీలుండును గదా! అయితే బైబిలులోని దేని యక్షరమైనను తగ్గింప వీలులేదు. ఎందుచేత అని అడుగుదురేమో అవి లెక్కింపబడియుండుట మాత్రమే కాక శాస్త్ర పద్ధతినిబట్టి ఏడు అను సంఖ్యచేత శేషములేకుండ భాగింపబడును. సంఖ్యాక్షర గణన విషయములో హెబ్రీ బైబిలులో మొదటి పంక్తి మాహద్భుతకరమైన పంక్తి. ఇట్టిదెవ్వరైన వ్రాయగలరా? ఈ విషయము బైబిలు పండితులు మొన్న మొన్ననే కనిపెట్టిన నూతన విషయమైయున్నది. బైబిలు చరిత్రలో "ఏడు" అను అంకె పరిశుద్ధమైన అంకెగా భావింపబడుచున్నది. బైబిలు దైవగ్రంథమనుటకు కనిపెట్టబడిన యీ నూతన విషయము ఒక ఋజువుకదా!

**4. యూదులు:–** వీరి జనకుడు అబ్రాహాము (క్రీ.పూ. 1920) యూదులను గురించి ఆయన కాలమునుండి మలాకీ ప్రవక్త వరకు (క్రీ.పూ. 379) బైబిలులో వ్రాయబడిన ప్రవచనములు నేటివరకును నెరవేరుచున్నవి. వీరు అన్ని దేశములలోను చెదరియున్నారు. వీరిని గూరించి యిదివరకు అన్ని దేశములవారికి అంతగా తెలియకపోయినను ముఖ్యముగ ఐరోపా యుద్ధకాలమునుండి (1914 – 1918) వార్తాపత్రికలవలన చాల సంగతులు తెలియుచున్నవి. ఈ జనాంగమెప్పటి నుండి యున్నదో చూడండి. దేవుని నియమిత జనమగు యూదులను వారు, కాలచక్రమును చూపునట్టి గడియారమువంటి వారు వీరికి దేవుని గడియారమనిపేరు. వీరి చరిత్ర నడుచుచున్నప్పుడు లోకములో గుర్తించినయెడల ఏ సంగతి తర్వాత ఏ సంగతి జరుగునో తెలియగలదు. లిఖిత రూప ప్రవచనమునన్న వీరి చరిత్రనుబట్టి తక్కిన జనాంగముల చరిత్రయుండును. యూదులను బాధించిన ఫిలిష్తీయులు

మొదలగువారు నశించిరిగాని ఎన్ని హత్యాకాలములు వచ్చినను వీరు నశింపలేదు. యూదుల జనాంగములో అనేకులు క్రీస్తు నంగీకరించినను, వారి జనాంగమింకను ఆయనను అంగీకరింపలేదు. క్రీస్తు భక్తులు ఆరోహణమైన తరువాత క్రీస్తువిరోధి పరిపాలనలో ఆ జనము అంగీకరించు వరకును యీ అనంగీకారము నిలిచియుండును. దేవుని నోటనుండి వెడలివచ్చిన వాక్యముల సముదాయమును, రక్షక నరుడుగా దేవుడు ప్రత్యక్షమైన క్రీస్తును ప్రకటించిన క్రీస్తుమత సంఘ చరిత్ర, లోకమునకు ప్రదర్శించినవారు యూదులే.

**5. సంఘవ్యాప్తి:-** సర్వసృష్టికి సువార్త ప్రకటించుడనియు విన్నవారిని నా శిష్యులనుగ మార్చుడనియు, క్రీస్తుప్రభువు చెప్పిన హితవచనము నేటివరకు నెరవేరుచున్నది. క్రైస్తవ సంఘము దేశ మతముగా కాక సర్వలోక మతముగా బయలుదేరి, సార్వత్రిక సువార్త నాదము వినిపించుచున్నది. అన్ని దేశములయొద్దకును అన్ని మతములయొద్దకును వెళ్లి కనబడుచున్నందున వ్యతిరేక భావమునుబట్టి అనేక కష్టములు కలుగుచున్నను వ్యాపించుచున్నది. పండితులు, దేశాధికారులు, సామాన్యులు ఆపుజేయచూచినను ఆగకున్నది. క్రీస్తు సంఘమునకు కలుగు హింసలు ఆటంకములు మరి యేమతమునకును కలుగవీలులేదు. సంఘవ్యాప్తియొక్క గొప్ప ఋజువు కాదా!

**6. క్రైస్తవ మతముచేయు లోకోపకారములు:-**

1) లోకములు పుట్టకముందే నరజనరక్షణార్థమై దేవుడాలోచించిన ఆలోచన, లోకము పాపమునపడిన ప్రపంచాది చరిత్రలో క్రీస్తుయొక్క అవతార వాగ్ధానము నందు వెల్లడియైన కొన్నాళ్ళకు యూదుల మతమను నామముతో నేటివరకు భూలోకమంతటికి అలుముకొనుచు, రక్షణాహ్వానము చేయుచు, ఆది మతమును మధ్యకాల మతమును, నవీనకాల మతమును అయియుండుట మాత్రమేకాక అనాదిమతమును అనంతకాల మతమును సర్వజన మతమును

అయివున్నదని స్ఫురింపజేయుటకు అందరియొద్దకు వచ్చి కనబడుచుండును.

2) బైబిలు గ్రంథము లోకస్థులందరు చదువవలసిన దైవ గ్రంథమగుటచేత అన్ని భాషలలో అచ్చువేయించుట.

3) క్రైస్తవులలో లోపములున్నను, బైబిలునుబట్టికాక దానినర్థము చేసికొనుటనుబట్టి క్రైస్తవులు అనేక శాఖలయిరి అనుచింత కలిగియున్నను ఇబ్బందులు, అవమానములు, వ్యాధులు, శత్రుబాధలు, ప్రాణహత్యలు సంభవించుచున్నను, యెన్ని మతఖండనలు బయలుదేరినను ఎంత ధనము వ్యయమగుచున్నను ఎన్ని ఆపదలు తారసిల్లినను, ఎన్ని అపజయ సూచనలు కనబడినను సర్వలోకము రక్షింపబడవలెనను దీర్ఘకాల వాంఛ కలిగి క్రీస్తు ఆజ్ఞానుసారముగా అన్నిదేశముల వారికిని క్రీస్తు వార్త నందించుటకు సాహసించుట.

4) అన్ని తరగతులవారును సహోదరభావము కలిగియుండ వలెనని పట్టుపట్టుట.

5) ఇతర మత గ్రంథములను కూడ పరిశీలించుట

6) నరమాంస భక్షకులను సైతము బోధవలన సాధు పరుచుట.

7) పిల్లలకు అన్నవస్త్రాదులిచ్చి పోషించుటకును విద్యాబుద్ధులు నేర్పించుటకును, బోర్డింగులు, పాఠశాలలు స్థాపించుట.

8) రోగులకు ఆత్మజీవనార్థమైన దైవవాక్య బోధను, ఆరోగ్య దాయకములైన ఔషదములను ఏర్పరచి ఆదరించుటకై వైద్యశాలలు స్థాపించుట.

9) బీదల పోషణార్థమై పలువిధములగు చేతిపనులు నేర్పు శాలలు స్థాపించుట.

10) మతవ్యాపకార్థమైన పుస్తకములు, పత్రికలు మొదలగునవి ప్రచురించుట.

11) ఏకదేవారాధన, మాతృభావము, విద్య, నాగరికత, వృత్తి వైద్యము, దేశపరిపాలన, నూతన యంత్రాదుల కల్పన, సుఖజీవనార్థమైన ప్రపంచశాంతి, బానిసత్వ నిర్మూలనము యీ మొదలగు సకల జనోపయోగ కార్యాభివృద్ధికి ముఖ్యకారణముగా తోడ్పడుట.

12) క్రైస్తవులను మతమునందు బలపరచుచు దైవభక్తియందు స్థిరపరచుటకై ప్రతి ఆదివారము దైవారాధన జరుపుట, సమయోచితమగు సభలుచేయుట.

13) ప్రతివారి శరీర జీవనమును పారమార్థిక జీవనమును వర్ధిల్లునట్లును కష్టనివారణ కలుగునట్లును శ్రమకాలమందు నీతిపారము గ్రాహ్యమగునట్లును సదాదైవప్రార్థనలు చేయుట.

**7. రాళ్ళు:–** బైబిలు చరిత్ర జరిగిన దేశములలో యీమధ్య యొక కంపెనీవారు రాళ్ళు త్రవ్విచూడగా వాటిమీద అన్యరాజుల వలన చెక్కబడిన బైబిలు సంగతులున్నవి. మీరు ఊరకుండిన యెడల ఈ రాళ్ళ కేకలు వేయుననునది నెరవేరినది (లూకా 19:40). రాళ్ళు చేయు ఋజువు గట్టి ఋజువే.

**పిరమిడ్లు:–** ఆఫ్రికాయందలి ఐగుప్తులోని ఫిరమిడ్ల చరిత్ర చదువతగినది. నేటి బైబిలు పండితులు ఫిరమిడ్‌ను గురించి క్రొత్తగా కనుగొన్న విషయములు బహుమనోహరముగా నున్నవి. బైబిలు సత్యమని ఋజువు పరచుటకు ఫిరమిడ్లు ఒక గొప్ప సాధనము (యెషయా 19:19).

**8. కైలాసమహర్షి:–** ఈయన చాలాకాలము క్రీస్తుమత ప్రచారకుడుగా నుండి అన్ని దేశములలో సువార్త వినిపించి వృద్ధాప్యమందు హిమాలయ పర్వతముచేరి దైవధ్యానములో నుండగా యేసుక్రీస్తు ప్రభువు ప్రత్యక్షమై నేను వచ్చువరకు యిచ్చటనే యుండవలెను అని చెప్పినందున నేటివరకును, అనగా మూడువేల వందల ఏండ్లనుండి అచ్చటనే యున్నాడు. ఈయనకు మన అన్న వస్త్రాదుల వాడుక లేనేలేదు.

మనదేశీయుడైన సాధుసుందరసింగుగారు (1905). యీయనను చాలమార్లు దర్శించిరి. సింగుగారు మనకాలములో సర్వలోక సంచారములు చేసిన క్రైస్తవ మతోపదేశకుడు. నిర్జన ప్రదేశమందు 40 దినములు కఠినోపవాసము పూనుకొని దైవసంభాషణముచేసి పరలోక విషయములు తెలిసికొని ఎవ్వరును వ్రాయలేని సంగతులు వ్రాసిన మహానుభావుడు. ఈయన పుస్తకములు అందరును చదువదగినదే. (ఈయన రాజమండ్రిలోగూడ ఉపన్యాసములిచ్చిరి).

**9. రహస్య సన్యాసుల మిషను:-** వందలకొలది క్రైస్తవ ఋషులు క్రీస్తు రాకడ కొరకు కొండలలో కనిపెట్టుచున్నారనియు, త్వరలోనే బయటకు వత్తురనియు సింగుగారు తెల్పిరి వీరు యీయనవలెనే క్రీస్తుతో సంభాషించుచున్నారు. వీరి సంఘమొక ఋజువుగదా!

# 3. క్రైస్తవ మత సంఘము

ఇది రెండు భాగములు:- 1) బాహ్యసంఘము : దీనిలో నామక క్రైస్తవులుందురు. వీరు అంతరంగ సంఘమునకు సిద్ధపడుచుందురు. 2) అంతరంగ సంఘము : దీనిలో విశ్వాస క్రైస్తవులుందురు. వీరందరును రక్షింపబడుదురు. వీరిలో కొందరు పెండ్లి కుమార్తె సంఘమునకు సిద్ధపడుచుందురు.

**అంతరంగ సంఘము రెండు తరగతులు:- 1) సామాన్య విశ్వాసుల తరగతి :** వీరు అన్ని విషయములు నమ్ముదురుగాని రాకడ కలదనిగాని రాకడ నేడేయనిగాని నమ్మరు. కాబట్టి రాకడకు సిద్ధపడలేరు గనుక రాకడలో పాల్గొనరు. **2) రాకడ విశ్వాసులు:-** వీరు అన్నియును రాకడయును నమ్ముదురు గనుక రాకడకు సిద్ధపడగలరు.

**రాకడ విశ్వాసుల తరగతి రెండు సమూహములు:-** 1) మృతులైన విశ్వాసుల సమూహము. వీరు రెండవరాకడవరకు మోక్షములో

ఒక భాగమందుయుందురు (1థెస్స 4:16). 2) సజీవులగు విశ్వాసుల సమూహాము. వీరు రాకడ వరకు బ్రతికియుండువారు వీరే మరణమెరుగనివారై, మహిమ శరీరధారులుగా మోక్షమేఘమునకు ఆరోహణమగుదురు. తత్పూర్వమే మృతులైన మోక్షవాసులు అక్కడకు వచ్చియుందురు. వీరును వారును కలిసి ఒక గుంపుగా చేరి పెండ్లికుమార్తెయను బిరుదుతో క్రీస్తుతోకూడ నూతన యెరూషలేమను మహోన్నత మోక్షమునకు వెళ్ళుదురు.

- క్రైస్తవ మత సంఘము
  - బహిరంగ
  - అంతరంగ
    - సామాన్య విశ్వాసులు
    - రాకడ విశ్వాసులు
      - మృతులు
      - సజీవులు

**2. పెండ్లికుమార్తె సంఘము:–** యూదులు అన్ని జనాంగముల జాబితాలోనుండి ప్రత్యేకింపబడి క్రీస్తు జన్మించు జనాంగముగా ఏర్పరుపబడినట్లు లోకములోని ప్రజలందరిలో నుండియు ప్రత్యేకింపబడి నూతన యెరూషలేమునకు వెళ్ళుటకేర్పరుపబడిన విశ్వాసుల గుంపునకు పెండ్లికుమార్తె సంఘమనిపేరు. ప్రకటన పన్నెండవ అధ్యాయములోని స్త్రీ ఎవరు? యూదులును క్రైస్తవులును అన్యులును క్రీస్తువారై ఏర్పడిన సంఘము. ఈ సంఘము మూడు భాగములు. మొదటి భాగమునకు మగశిశువు అనిపేరు. రెండవ భాగమునకింకను స్త్రీ అను పేరున్నది. ఈమె అరణ్యమునందు పోషింపబడును. మూడవ భాగమునకు సంతాన శేషమని పేరు. ఇది మరొక చోట నుండును (ఆ స్త్రీ యూదుల సంఘము కాదు).

Bible Mission HQ Guntur

**3. సైతాను మాయోపాయములు, దేవుని జ్ఞానోపాయములు:–** (సైతానుయొక్క అధికార ఫలితముగాని అతని సైనికులపని గాని జరుగునప్పుడు ఇది సైతానుపని యందుము. రాజు సైన్యము ఒక దేశమును జయించినపుడు ఫలాని రాజు జయించినాడందుము గదా! సైతాను ఆది నరుని మాటిమాటికి పడవేయును పోయిన పక్షమున సైతాను ప్రతినిధియగు పాపనైజము పడవేయును.

**1) సైతాను:–** ఆదిదంపతులను పాపములో పడవేసెను.

**2) దేవుడు:–** వెంటనేవారిని క్షమించి వారి సంగతియగు సర్వలోక జనమును రక్షించుటకై రక్షకుని పంపెదనని వాగ్ధానము వినిపించెను.

1. సై:– రక్షకవాగ్ధానము వినబడిన తర్వాత జనసంఖ్య వృద్ధితోపాటు పాపసంఖ్య వృద్ధియు గావించెను.

2. దే:– అవిశ్వాసులను విశ్వాసులును చాలకాలము కలిసి యుండిన పిమ్మట వీరిద్దరిని విడదీసెను (లేనియెడల ఒకనిని బట్టి ఒకరు చెడిపోవుదురు. అవిశ్వాసులకు మంచిచెడ్డలను తెలుపు మనస్సాక్షి ధర్మశాస్త్రమాయెను).

1. సై:– విశ్వాసులగువారు ప్రత్యేక జనాంగమైరి. ఆ జనాంగమే యూదుల జనాంగము. ఈ జనాంగములోనే రక్షకుడు జన్మింపవలసి యుండెను. గనుక ఆ జనాంగమును విగ్రహారాధనలోనికి దింపెను.

2. దే:– వారిని అనేకయేండ్ల వరకు శిక్షించి ఆ పాపమును మాన్పించెను.

1. సై:– ఆ పాపమున పాల్గొనని వంశోద్ధారకులలో కొందరిని ఏదో ఒక పాపములో పడవేయుచు వచ్చెను.

2. దే:– ఆ వంశోద్ధారకులను పశ్చాత్తాప మూలముగా శు ద్ధీకరించి స్థిరపరచెను.

1. సై:– దేవుడు తన జనులతో మాట్లాడని నిశ్శబ్ధకాలమున యిక రక్షకుడు జన్మించనట్టె అని చెప్పి నిరాశ కలిగించెను.

2. దే:- వారి నిరాశ తొలగించుటకై యోహాను యనుపేరు గల ఒక బోధకుని పంపెను.

1. సై:- ఎన్ని అడ్డములు పెట్టినను రక్షకుడు రాకుండా యుండలేదని ఆయనను యెదురాడుటకు ఆ యూదులలో కొందరిని ఎన్నుకొని చంపించెను.

2. దే:- రక్షకుని బ్రతికించెను.

1. సై:- ఆయన బ్రతికివచ్చి పరలోకమునకు వెళ్ళినాడని చెప్పి ఆయన శిష్యులమీద పడి హింసించెను.

2. దే:- వారు పారిపోయిన దేశములలో వారివలన మత వ్యాపకము చేయించి విదేశీయులనేకులను శిష్యులనుగా మార్చెను.

1. సై:- అప్పుడు శిష్యులలో శిష్యులకు మత వివాదములు కల్పించెను.

2. దే:- సత్యపరిశీలనార్థమై వారిచేత దైవవాక్య గ్రంథమగు బైబిలు చదివించెను.

1. సై:- బైబిలు పరిశుద్ధ గ్రంథము గనుక అందరును చదువ కూడదను తలంపు పుట్టించి దానిని దాచిపెట్టెను.

2. దే:- ఒక భక్తుని పంపించి బైబిలును బైట బెట్టించెను కొందరిచేత సుమారు 1,200 భాషలలోనికి మార్పించెను.

1. సై:- అనుచరులతో మరల భిన్నాభిప్రాయములు కలిగించి అనేక మతశాఖలు (అనగా మిషనులు) పెట్టి ఐక్యత చెడగొట్ట చూచెను.

2. దే:- ఇన్ని మిషనులు వచ్చినందుకు సర్వలోక దేశములలోను దైవ సందేశము వ్యాపింపజేయుచున్నాడు.

షరా:- ఇక ముందుకును దేవుడు సైతాను క్రియలను నాశనము చేసి తన ఉపదేశమును నెరవేర్చుకొనునని "మిత్ర" వలన తెలిసికొనగలరు.

షరా:- తుదకేమి జరుగును? దేవుడు సైతానును, అతని దూతలను దైవకటాక్ష ద్వేషకులను నిత్యాగ్ని నరకమున పడవేయును గనుక యెవరు గెల్చినట్లు? సైతాను అనేకులను తన వశము చేసికొనుట చేత అతడే గెల్చినట్లు గదా అని అడుగుదురేమో? శిక్ష నొందువారు జయశాలురా? వారినిగూడ దేవుడు రక్షింపలేడా యని అందురేమో, వారు కోరి నమ్మి సమ్మతించిన రక్షింపగలడు ఆత్మ చిత్తమును మానవ చిత్తమును వ్యతిరేకించిన రక్షింపడు.

# 4. దైవ ప్రార్థన చేయు విధము

1. ప్రార్థించుటకై గదిలోనికి వెళ్ళి మోకరించి నేత్రములు మూసికొనవలెను. మంచి చెడ్డలన్నియు శుభ్రముగా మరచిపోవలెను. దేవుని మాత్రమే తలంచుకొనవలెను. వేరు తలంపులను మనస్సులోనికి రానీయకూడదు.

2. నీ పాపములన్నియు దేవునికి చెప్పుకొనవలయును. తలంపు పాపములు, దృష్టిపాపములు, మాటపాపములు, క్రియా పాపములు, మనుష్యులకు విరోధమైన పాపములు, జంతువులను నిర్దయగా చూచు పాపములు ఈ మొదలైనవన్నియు ఒప్పుకొనవలెను.

3. తండ్రి క్షమించినాడని నమ్మి వందనము లాచరింపవలెను.

4. ఇకమీదట జాగ్రత్తగా నడచుకొన ప్రయత్నింతునని చెప్పుకొనవలెను.

5. పాపమును విసర్జింపగల శక్తిననుగ్రహించుమని ప్రార్థింపవలెను.

6) దైవభక్తిగా నడచుకొను శక్తి గూడ దయచేయుమని ప్రార్థింపవలెను.

7) దేవుడు కీడును తొలగించి చేసిన మేళ్ళు తలంచుకొని వందనములు చెప్పవలెను.

Bible Mission HQ Guntur

8) ఆయన కావలసినవి యిచ్చి అవసరము తీర్చిన మేళ్ళు తలంచుకొని వందనములు చెప్పవలెను.

9) ఇప్పుడు యిష్టమువచ్చిన సంగతి యెత్తుకొని ప్రార్థింపవలెను. అన్నము, వస్త్రము, ధనము, ఆరోగ్యము, విద్య మొదలైనవన్నియు దయచేయవలసినదని ప్రార్థింపవలెను.

10) దేవుడు ప్రేమ, జ్ఞానము, పరిశుద్ధత, శక్తి, న్యాయము, సర్వత్ర యుండగల సమర్థత, జీవము, మన ప్రార్థనాలకించు లక్షణము యీ మొదలైనవి గలవాడై యున్నందుకు స్తోత్రము చేయవలెను. మహానందము కలిగించుకొనవలెను.

11) ఇదంతయు ముగించిన తరువాత వీలున్నంత సేపు నిశ్శబ్ధముగా నుండవలెను. అప్పుడు దేవుడు మంచిమంచి తలంపులు పుట్టించును.

**2. దేవుని దానములు:–** ఆకాశము, భూమి, దైవలక్షణములు. దైవావతారము. యీ నాలుగు గుర్తించవలెను. నరునిలో దేవుడు తన గుణములనే పెట్టియున్నాడు. వాటిలో స్వతంత్రతను గురించి యెక్కువ స్తుతింపవలసినది. నేను యిచ్చిన యీ నాలుగు పూర్తిగా అనుభవించుడి యని దేవుడు మనలనుగాని, దూతలనుగాని, జీవరాసులనుగాని బలవంతముచేయడు. మన యిష్టానుసారముగా అనుభవించుచు ఉపయోగించుకొననిచ్చుచున్నాడు. అడ్డమురాడు (ఆది 2:16) వాడినను వాడకపోయినను ఆయన ఏమీ అనడు వాడినయెడల మనకు మేలు. వాడనియెడల అనర్థమైన ఫలితములకు ఆయన పూచీదారుడు కాదు. మనము పొరబాటులో పడిన యెడల రక్షించుము అని ప్రార్థింపగా రక్షింపనైన రక్షించును గాని పడునప్పుడు అడ్డుపెట్టడు. ఆదిలో అట్లే జరిగినది. మన మొదటి తల్లిదండ్రులు దైవాజ్ఞను మీరినప్పుడు అడ్డుపెట్టక తీరా మీరిన వెనుక రక్షింపవెళ్ళెను. అడ్డు పెట్టినయెడల ఆ స్వతంత్రత ఇచ్చినాడను మాటయేమి?

దేవుడు మనకేది యిచ్చినను చాలి చాలనట్టియ్యక సమృద్ధిగా నిచ్చును (యోహాను 6:11; యాకోబు 1:5) శ్రేష్టమైనవే యిచ్చును (యాకోబు 1:7).

**3. దైవోద్దేశము:–** నరులను కలుగజేయుటలో దేవుని యుద్దేశమేమి? ఆయనలోని దివ్యలక్షణములను అవిచేయు కార్యములను, ఆయన మహిమను నరులనుభవించి యానందింపవలెనని యుద్దేశించి దేవుడు వారిని కలుగజేసెను. నరులు చెడిపోదురు గనుక తన యుద్దేశము నెరవేరినదని తెలిసి దేవుడేల వారిని సృజించెనని యందురేమో? ఆయన జీవమైయున్నాడు గనుక సృజింపకుండ నెట్లుండగలడు? ఆయన శక్తిగలవాడు గనుక నమ్మగలవారిని రక్షింపనైన రక్షించునుగాని మొదలే నరులను కలుగజేయకుండ నుండలేడు. నమ్మువారు దేవునితోపాటు నిత్యము ఆనందముగా జీవించు భాగ్యము కలిగియుందురు.

**4 కృతజ్ఞతా స్తుతి:–** దైవప్రార్థనాది కార్యములు మంచివేగాని కృతజ్ఞత కలిగియుండుట మరింత మంచిది. దేవుడిచ్చినవన్నియు ఉచితార్థమైన దానములే. 1) గాలి, ఎండ, వెన్నెల, వాన యివి దేవుని దానములు. 2) వృక్షాదులు, ఖనిజములు భూమ్యాకాశములు దేవుడు మన కొరకేకదా సృజించెను. 3) ధనధాన్యములు, పొలములు, అన్న వస్త్రాదులు, ఔషదములు వేసికొను మూలికాదులు ఆరోగ్యము విద్య, వృత్తి ఈ మొదలగునవి ఆయన కృపవలననేగదా మనకు లభించినవి. 4) మతోపదేశము దైవభక్త్యాపేక్ష విశ్వాసము, ఆనందము యివియు ఆయన కటాక్ష ఫలితములెగదా 5) వ్యాధులు మొదలగు వానివలన కలుగు గండములనుండి తప్పించి వేయు ఉపకారమాయన యత్నమె గదా! అది కావలెను. యిది కావలెను అది తొలగించుము. ఇది తొలగించుము యని ప్రార్థించుట మంచి అలవాటే. అయితే యిదివరకు దేవుడు చేసిన యీ రెండు విధములైన యుపకారముల నిమిత్తమై కృతజ్ఞత కలిగి స్తుతించుట మరింత మంచి అలవాటుగదా! ఇదిగో నాకు

యున్నదంతయు నీదె అని సమస్తమాయనకు సమర్పించి కృతజ్ఞతతో జీవించువారికి దేవుడు యింకను యియ్యవలసినవ్నియు యిచ్చుచుండును. ఆయన మనకేమియు బాకీలేదు. మనమే ఆయనకు బాకి, సమర్పణ, కృతజ్ఞత స్తుతి ఆయనకు బాకే.

# 5. ప్రశ్నోత్తరములు

1. ప్రశ్న:- మన ధర్మకార్యములవలన మోక్షము దొరకదా?

జ:- ధన ధాన్యములవలన దారిద్ర్యము గతించును గాని వాటివలన మోక్షము దొరకదు. విద్యవలన తెలివి కలుగును ఉద్యోగము కుదురును గాని వానివలన మోక్షము దొరకదు. గొప్ప వంశమువలన గొప్పతనము కలుగును. గాని దానివలన మోక్షము దొరకదు. ఉపకార కార్యమువలన సత్కీర్తి కలుగును, గాని వాటి వలన మోక్షము దొరకదు. పాపములు పరిహారమగు నిమిత్తమును మోక్షము దొరుకు నిమిత్తమును దేవుడే ఏ కార్యము చేసెనో ఆ కార్యములను నమ్ముటవలననే మోక్షము దొరుకును ఇవి క్రీస్తు చరిత్రయందు గలవు.

2వ ప్రశ్న:- నమ్మిన సరిపోవునా?

జ:- సరిపోవును.

3వ ప్రశ్న:- నీవొప్పుకొన్న పాపములు దేవుడు క్షమించినాడనియు, పాపములను విసర్జించు శక్తి దయచేయుననియు, సత్కార్య ప్రవర్తన అనుగ్రహించుననియు అన్ని ప్రార్థనలు ఆలకించుననియు తుదకు మోక్షమునజేర్చుననియు నమ్మిన చాలును.

4వ ప్రశ్న:- ధర్మకార్యములవలన ఏమియు ప్రయోజనము లేదా?

జ:- ఈలోకములో ప్రయోజనము కలదు. ఆ లోకములో ఏమియు ప్రయోజనములేదు.

5వ ప్రశ్న:- ఆలాగైతే యివి మానవలసినదేనా?

జ:- మానరాదుగాని వీటివలన మోక్షము (రక్షణ) అను తలంపు మానవలెను.

6వ ప్రశ్న:- వీటిని దేవుడు మోక్షమున దయచేయడా?

జ:- ముందుగా యీలోకములోనే మోక్షప్రదేశ నిశ్చయత సంపాదించిన పిమ్మట నీ ధర్మకార్యమునకు విలువగలదు. వీటివలన నీకు బహుమానము కలుగును. లోకమంతయు సంపాదించి మోక్షమునకు చేరనియెడల ఆ సంపాదన యేమగును? (మత్తయి 16:26).

7వ ప్రశ్న:- దేవుడు సైతాను పాపరాశిని కష్టరాశిని మనమీదికెందుకు పంపవలెను?

జ:- ఇది దేవుడు పంపుటలేదు (విలాప 3:33) మన పాపములనుబట్టి శ్రమలు కలుగుచున్నవి గాని శ్రమలవలన నరుల జ్ఞానము కలిగించుకొందురని దేవుడు చూచి ఊరుకొనుచున్నాడు. ప్రార్థింపగా అవి తొలగించును (యోహాను 14:14).

8వ ప్రశ్న:- దేవుడేల నరుడుగ జన్మింపవలెను? అక్కడ యుండి రక్షింపలేడా? మరణమందనేల?

జవాబు:- ప్రేమచేతనే నరజన్మమెత్తెను ఆయన ప్రేమకార్యములను, ఆకార్యపద్ధతులను చూచి మనము సందేహపడుట యెందుకు? ఆయనకు కష్టముగాని మనకేమి కష్టము? ఒక ధర్మాధికారి నీయింటికి వచ్చి నీ అప్పుతీర్చి నాకేమియు ఇయ్యనక్కరలేదు అని అన్నయెడల నీకిష్టము ఉండదా?

9వ ప్రశ్న:- ఎన్నిక జనమగు యూదులెందుకిన్ని కష్టముల పాలగుచున్నారు?

జ:- వారి అపరాధములవలననే (లేవీ. 26వ అధ్యా). క్రీస్తు వచ్చునని బోధించి, బోధించి తీరా వచ్చిన తర్వాత ఆయనను గుర్తులనుబట్టి గ్రహింపకపోవుటయు అంగీకరింపకపోవుటయు,

తృణీకరించుటయు వారి ముఖ్యాపరాధమై యుండెను (యెషయా 61:1–3; 7:14న మీకా 5:2; జెకర్యా 9:9; మత్తయి 1:22; లూకా 4:16–30; మత్తయి 2:3 అధ్యా॥ యోహాను 1:10; 14:15; 17:18; 1యోహాను 3:1–2. క్రీస్తు విషయము దీర్ఘాలోచన చేయుచున్న నవీన కాల యూదులు, తొందరపడి పూర్వకాల యూదులకన్న ఉత్తమజనముగా కనిపించుచున్నారు.

10వ ప్రశ్న:– క్రైస్తవులేల లోపములుగలవారై యున్నారు?

జ:– అట్టివారు పరిపూర్ణ క్రైస్తవులుకారు, క్రైస్తవులలోని లోపములు చూచి అవి మతములోని లోపములనిగాని క్రీస్తులోపములని గాని బైబిలు లోపములనిగాని తలంపరాదు.

11వ ప్రశ్న:– క్రీస్తును గురించి తెలియనివారి సంగతి యేమి?

జ:– క్రీస్తును గురించి విననివారు విన్నను గ్రహింపనివారు, గ్రహించినను నచ్చనివారు అపరాధులుకారు. ఏనాటివారైనను ఏచోటివారైనను, కడవరి తీర్పునకు పూర్వమే నిత్యశిక్షపాలుకారు. ఎక్కడో ఒకచోట ఎప్పుడో ఒకప్పుడు నరునికి దేవుడు తన అవతారమగు క్రీస్తును గురించి తెలియజేయక మానడు ఒకనికి తెలిసినంత ధర్మమునుబట్టి తీర్పుండును.

12వ ప్రశ్న:– కడవరి తీర్పెప్పుడు?

జ:– ప్రకటనలో ఉన్నదిగదా! సంఘారోహణము. శ్రమకాలము, హర్మెగెద్దోను యుద్ధము, వెయ్యేండ్ల పాలన, సజీవులతీర్పు, సైతాను విడుదల యివన్నియు అయిన తరువాత కడవరితీర్పు.

13వ ప్రశ్న:– అంత్యదినములు అనగానేమి? (కార్య. 2:17)

జ:– 1) యూదుల మత సంఘము క్రీస్తు అవతార జీవితముతో అంతమాయెను. 2) క్రీస్తు ఆరోహణసంఘము రేపు రాబోవు క్రీస్తు రెండవ రాకడతో అంతమగును 3) అన్యరాజ్యకాలము అంతెక్రీస్తు అను

క్రీస్తు విరోధియొక్క ఏడేండ్ల పరిపాలనతో అంతమగును. 4) క్రీస్తు పాలించు శాంతి రాజ్యకాలము సజీవుల తీర్పుతో అంతమగును. ఈ నాలుగును అంత్య దినములని చెప్పబడును.

14వ ప్రశ్న:- దీనిలోయున్నదొకటియు నాకు నచ్చునప్పుడేట చేయవలెను?

జ:- దైవప్రార్థన చేయుము సత్యము నీకు బైలుపడును.

15వ ప్రశ్న:- దేవుడెట్లు బైలుపడును?

జ:- ఇదేమి ప్రశ్న:- ఆయనకు అనేక సాధనములున్నవి. ఏదోయొక దాని మూలముగ బైలుపరచును. నీ జ్ఞానమును వెలిగించును. అప్పుడు నీకు సత్యము తెలియును. లేదా నీ మనస్సాక్షిని శుద్ధీకరించును. అప్పుడు సత్యము తోచును లేదా నీలోని విశ్వాస లక్షణమును బలపరచును. అప్పుడు సత్యమును నమ్ముదువు. కన్ను చూడగలదు గాని వినగలదా? చెవి వినగలదు గాని చూడగలదా? ఏది చేయుపని అదిచేయును ఇది దేవుని యేర్పాటే నీలోనిదేదో యొకటి సత్యమును బైలుపరచును. అధైర్యపడకుము మనస్సాక్షి, సృష్టి, బైబిలు జ్ఞానము, లోకచరిత్ర, శ్రమానుభవము, ఉపకారానుభవము సహమానవ సమూహము, సత్‌గ్రంథ పరిచయము యీ మొదలైన వాటి మూలముగ దేవుడు సత్యము బైలుపరచును లేదా స్వప్నములో తెలియజెప్పును లేదా యేసుక్రీస్తు ప్రభువే నీకు ప్రత్యక్షమై బోధించును. తెలిసికొనుటకు నిర్లక్ష్యపెట్టకుము.

16వ ప్రశ్న:- దేవునిని త్రైక దేవుడని అందురు. అదియెట్లు?

జ:- ఇది యెవ్వరికిని యీ లోకములో అర్థముకాదు; జ్వాల, వేడిమి, కాంతి యీ మూడును కలిసి ఒకటేకదా! వేడిమి తీసివేసిన యెడల తక్కిన రెండును పోవును. కాంతిని తొలగించిన మిగతా రెండును పోవును. దేవుడు బైబిలు గ్రంథములో మానవులయుపయోగార్థమై

తండ్రిగాను, కుమారుడుగాను, పరిశుద్ధాత్మగాను బైలుపడును (ఆది 1:1,2,3; సంఖ్యా 6:22-26; యెషయా 6:1,2; మత్తయి 3:13-17; 28:16-20; ప్రక. 4:1-8. దేవుడు మానవులకు కనబడవలెనని యేసుక్రీస్తుగా మానవావతారమెత్తెను.

17వ ప్రశ్న:- ఆయన మనవలె నరుడుగా జన్మించెనా?

జ:- మన జన్మమునకు తల్లిదండ్రులు అనగా నరులు కారకులు ఆయన నరావతార జన్మమునకు దైవాత్మ కారణమని బైబిలులోనున్నది లూకా 1:34,35 మనుష్య ప్రయత్నమేమియు లేదు. నిష్కళంక నరస్వభావమును ధరించుకొని నరజన్మ మెత్తుటనుబట్టి ఆయనకు మనుష్య కుమారుడను పేరుకూడ గలదు ఫిలిప్పీ 2:5-11; లూకా 8:21. ఆయన నరావతారములో నున్నను యెన్నడును ఏ పాపమును చేయలేదు గనుకనే ఆయన అందరిని రక్షింపగలడు హెబ్రీ 4:15; 1యోహాను 3:5; హెబ్రీ 7:25,26. ఆయన సిలువమ్రానుమీద ఘోరమరణ సమయమందు మహాయజ్ఞమై పాపపరిహారార్థమై ధారపోసిన రక్తమువలన మనలను పవిత్రులనుగా చేయగలడు యోహాను 1:7; ఎఫెసీ 1:7; హెబ్రీ 9:11-22.

18వ ప్రశ్న:- ఆయన దేవుడనునది బైబిలు వాక్యములోగలవా?

జ:- కలవు. యెషయా 9:6; యోహాను 20:8; రోమా 9:5; ఫిలిప్పీ :6-7; తీతు 2:11-13 ఇవి దేవుడు అను పేరున్న వాక్యములు. దేవుడని ఋజువు పరుపగల వచనములు వృత్తాంతములు చాలగలవు. ఆయన భూలోక జీవితము పరిశీలించిన నిజముగా ఈయన దేవుడే అని మానవులు స్వయముగా చెప్పుకొన వీలుండును. నేనే దేవుడనని ఆయన చెప్పుకొనవలసిన అవసరము లేకుండనే ఆయన చరిత్ర నడిచినది. ఆయన లోకైక రక్షకుడు : కార్య 4:12 జ్వాల తండ్రికిని, కాంతి కుమారుని, వేడిమి పరిశుద్ధాత్మకును గురుతుగా భావించుకొన్న యెడల త్రిత్వమర్థమగును.

19వ ప్రశ్న:- యేసుప్రభువుని దేవుని కుమారుడని యెందుకనుచున్నారు? దేవుడు వేరు, కుమారుడు వేరు అని కనబడుచున్నది గనుక మనము ఆ దేవునినే పూజింపరాదా?

జ:- దేవుడు దేవుడుగా భూలోకమునకు వచ్చినయెడల మనము చూడలేము. గనుక నరుడై యేసుక్రీస్తుగా ప్రత్యక్షమాయెను. ఈ నరుడే దేవుడు గనుక కుమారుడు. జ్వాలలోని కాంతికి పోల్చబడిన క్రీస్తుప్రభువు జ్వాల అంతటికిని, ప్రతినిధి. సంభాషణకు అనుకూలముగా నుండునట్లు కాంతిని ప్రత్యేకపరచుకొను విధముగానే కుమారుని ప్రత్యేకపరచి మాటలాడుదుము. దేవునిలోనుండి వచ్చినవాడే గనుక కుమారుడన్నాము. సృజింపబడక దేవునిలో అనాదినుండి యున్నవాడే (కాంతి జ్వాలకును వేడిమికిని తర్వాత వచ్చినదా? కాంతి అనేది ఉండినదా?) కాంతిపని జ్వాలను వెల్లడించుటయే. అలాగే కాంతియగు క్రీస్తు దేవుని వెల్లడించెను. యోహాను 1:1-10; 8:12; 9:5. భూలోకములోని తండ్రిలోనుండి వచ్చినవాడు గనుక కుమారుడనుచున్నాము. కుమారుడు తండ్రిని బైలుపరచువాడు క్రీస్తును అట్టివాడే. కుమారుడు కొన్నాళ్ళకు తండ్రివలన కలిగినవాడు. క్రీస్తు విషయములో యీ భావము సరిపడదు. కాంతి జ్వాలలోనిదే. క్రీస్తు దేవునిలోనివాడే. ఆయన దేవునిలో మూడవ భాగము అని తలంచుట అసంగతము. క్రీస్తు దేవుని కుమారుడైతే దేవునికి భార్యయున్నదా అని ప్రశ్నవేయుట తగదు. దేవుడు నరులను తన లక్షణములనుబట్టి నిర్మించినందున నరావతారమెత్తుట సవ్యముగానే యున్నది. క్రీస్తు మానవుల అన్ని ప్రశ్నలకు దేవుడిచ్చు జవాబైయున్నాడు. సామె 30:4; యెషయా 9:6; మత్తయి 26:63-67; యోహాను 1:14; 3:16; యోహాను 10:30, 38; 12:45; 14:7,19; 17:10; 1యోహాను 4:9.

20వ ప్రశ్న:- జన్మాంతరమును గురించి బైబిలులో నున్నదా?

జ:- 1) నరులు జంతువులుగా జన్మించుటగాని, జంతువులు నరులుగా జన్మించుటగాని బైబిలులో యెక్కడను కనబడుటలేదుగాని మరియొక జన్మమును గురించి అనగా పునర్జన్మమును గురించి కలదు. దుర్గుణము మార్చుకొనుటయు దైవచిత్తమునకు సరిపడని స్వాభిప్రాయమును వదలుకొనుటయు, నూతనస్వభావమును ధరించుకొనుటయు పునర్జన్మమైయున్నది. పరలోకరాజ్యము సమీపించి యున్నది. గనుక మారుమనసు పొందుడి అనియు (మత్తయి 3:7). ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యము చూడలేడనియు (యోహాను 3:3) ప్రభువు సెలవిచ్చిన మాటలు మనస్సు మార్పునకు సంబంధించినవే (తీతు 3:5). 2) మృతులైన భక్తులు భూమిమీదకు వచ్చుటను గురించి బైబిలులో నున్నది (మత్తయి 17:1-8; 27:52,53) క్రీస్తుప్రభువును, తన శిష్యులును కొండమీదికి ప్రార్ధన చేయవెళ్ళినపుడు పూర్వకాల భక్తులకు మోషే, ఏలియా అనువారు వచ్చి ఆయనతో మాటలాడిరి. క్రీస్తుప్రభువు సిలువ మ్రానుమీద మరణించినప్పుడు అనేకమంది భక్తులు పరలోకమునుండి వచ్చి తర్వాత యెరూషలేములో కనబడిరి.

## 6. నిషేధ ప్రశ్నలు

ముట్టవద్దు : 1) పరిశుద్ధులైన దూతలో దుర్బుద్ధి యెట్లు పుట్టెను? 2) దేవుడు ఆదిలోనే సైతానును నాశనము చేసియుండిన యెడల నరవంశము చెడకుండునుగదా? 3) ఆజ్ఞమీరిన స్త్రీని చెట్టు దగ్గరనే నాశనముచేసి మరొక స్త్రీని చేసినయెడల మనకీ కుమ్మరము రాకపోవును గదా? 4) త్రవ్వనేల - పూడ్చనేల? దేవుడు నరుడుగా జన్మింపవలసిన అవసరమేమి? పరలోకమునుండి రక్షింపపోయినాడా? 5) ఇన్ని మతాలు

వాదించుకొనుచున్నవి. ఇవిచూచి దేవుడెందుకూరకొనవలెను ఆపుచేయనైనా ఆపుచేయవలెను. దుర్బుద్ధులు వారికి పుట్టకుండ చేయవలెను. 6) పాపము చేసినందున నరులకు భూకంపములు, కరవులు, చావులు మొదలగు శిక్షలెందుకు? 7) నిత్యనరక మెందుకు? దేవుని ప్రేమ యెక్కడున్నది?

ఇట్టి ప్రశ్నలు నీ మనసులో ముట్టరాదు. ముట్టిన యెడల వాదము లేచి మనసులో కలత కలుగును. నిరాశస్థితిలోనికి వెళ్ళెదవు. నిషేద వృక్షఫలము ముట్టరాదు అను దైవాజ్ఞను మీరినందున ప్రథమ స్త్రీ పాపమునపడెనని లోక ఆది చరిత్రలో చదువుచున్నాము (ఆది 3 అధ్యా).

కొన్ని ప్రశ్నలకు మాత్రమే యీలోకములో జవాబు దొరకును, అన్నిటికి జవాబు మోక్షములో దొరుకును. గనుక మోక్షములోనికి వెళ్ళకుండ మనసును గంధరగోళముచేయు ప్రశ్నలను అంటుకొనరాదు దొరికినన్ని జవాబులు విని సంతుష్టి పడుట క్షేమమైయున్నది.

## ముగింపు

చదువరులారా! ఈ మిత్రలో నున్నదంతయు మీరు తెలిసికొన్న తర్వాత యేమి తీర్మానము చేసికొందురో! దేవుడుగా గాక నరునికి కనబడవలెనని చెప్పే నరుడుగానే దేశసంచారముచేసిన యేసుక్రీస్తు ప్రభువు తన శిష్యులకు సెలవిచ్చిన కడవరియాజ్ఞ యొకటి వినుడి "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి, నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపడును నమ్మనివానికి శిక్ష విధింపబడును"

(మార్కు 16:16). మా వ్రాత మీకు అర్థముకానిచోట దైవాత్మయే మీకు వివరించునుగాక!

ఇదంతయు నీ ప్రశ్నలకు జవాబులును విన్న తర్వాత సరిపడని యెడల యీ బోధ నిరాకరింప వచ్చునేమో కాని తత్పూర్వము నిరాకరించుట క్షేమముకాదు. ఈ బోధ అంతయు నేర్చుకొన్న పిమ్మట నమ్మిక కలుగకపోవుటయు, క్రీస్తును పూజింపక బోవుటయు, మోక్షమునకు వెళ్ళకపోవుటయు యెట్లో తెలియదు.

ఇవి చదువువారు వేదవిద్యాభివృద్ధి పొందుదురుగాక! ఇవి వినువారు శ్రద్ధానంద లక్షణావృద్ధి నొందుదురుగాక! అనుసరించువారు దైవ సహవాసాభివృద్ధి నొందుదురుగాక! ప్రకటించువారు నీతిమార్గము ననుసరించి నడుచుకొన్నట్లు యెవరు అనేకులను త్రిప్పుదురో వారు నక్షత్రములవలె నిరంతరము ప్రకాశించెదరు అను వేదవాక్యానుభవము కలిగియుందురుగాక! (దానియేలు 12:13). మేము చెప్పవలసిన బోధ చెప్పివేసినాము, తర్వాత మీ యిష్టము; దేవుడు మిమ్ము దీవించునుగాక!

మోక్షలోకము : రక్షితుల మోక్షము | పరదైసు | ప్రార్థన సమాజము | నూతన సమాజము

వాయుమండలము : ఇక్కడ దయ్యములుండును. ఎఫెసీ 6వ అధ్యాయము

అనాది | క్రైస్తవ సంఘకాలము | భావికాలము

దేవుడు
ఆయన లక్షణములు
ఆయన ఆలోచన పని
దేవదూతలు
సైతాను
లోకముల సృష్టి
పాపము - రక్షణ వాగ్దానము
పాపవృద్ధి
సైతాను సృష్టి
నిరీక్షన కాలము
నిశ్శబ్ద కాలము
యోహాను కాలము
క్రీస్తువారి కాలము
పెంతెకొస్తు కాలము
సంఘాధికాలము
హింసకాలము
అంధకార కాలము
బైబిలు బైలుపడిన కాలము
మిషనుల కాలము
నవీన సంఘకాలము
గుర్తుల కాలము
సంఘారోహణ కాలము
మహాశ్రమ కాలము
హర్మెగెద్దోను యుద్ధము
వెయ్యేండ్ల పరిపాలన
సజీవుల తీర్పు
సైతాను విడుదల
అంత్యతీర్పు

పాతాళలోకము : హేడెస్సు : ఇక్కడ మారని ఆత్మలుండును | సైతాను చెర | నరకము

# యాత్ర

గ్రంథకర్త

## యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2025 చందా : 10.00

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1968 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1976 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1983 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 1986 | ప్రతులు | 1000 |
| ఐదవ | ముద్రణ | 1990 | ప్రతులు | 2000 |
| ఆరవ | ముద్రణ | 1996 | ప్రతులు | 10000 |
| ఏడవ | ముద్రణ | 2016 | ప్రతులు | 2000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2017 | ప్రతులు | 2000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2018 | ప్రతులు | 3000 |
| పదవ | ముద్రణ | 2020 | ప్రతులు | 2000 |
| పదకొండవ | ముద్రణ | 2022 | ప్రతులు | 2000 |
| పన్నెండవ | ముద్రణ | 2023 | ప్రతులు | 2000 |
| పదమూడవ | ముద్రణ | 2025 | ప్రతులు | 2000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.

# విషయము

ఈ పుస్తకము చివరనున్న పతకములన్నియు గ్రంథ రూపమున ప్రచురింపవలసినదని కొందరు మిత్రులు దేవదాసు అయ్యగారిని కోరిరి. బోధకులిది చదివి తమ యిష్టము వచ్చినంత వివరముగా బోధించుటకిది యొక సాధనముగ నుండునుగాక! అనుకూలింపనివి విడిచిపెట్టవచ్చును. దీనికి దైవవాక్కునుబట్టి దేవదాసు అయ్యగారు **"మిత్ర"** అను పేరు పెట్టిరి. ఇది వినునట్టి అవిశ్వాసులు రక్షణనొందగల విశ్వాసులుగ మారవలెననియు, విశ్వాసులు ఆత్మీయ జీవనాభివృద్ధి నొందవలెననియు, పనివారు సేవలో ఉత్సాహము కలిగించుకొనవలెననియు ఉద్దేశించి యిది రచించిరి. మిత్రలోని విషయములు కాలక్రమమును బట్టి అమర్చబడినవి. సృష్టి మొదలుకొని గుర్తులకాలము వరకును, యిదివరలో జరిగిపోయిన వృత్తాంతములు, గుర్తులు జరిగినవి, జరుగుచున్నవి. గుర్తుల కాలమునుండి పతకము చివరివరకును యికముందుకు జరుగవలసిన వృత్తాంతములు ఈ మిత్ర భూగోళము చుట్టు మిత్రగా సంచరించుచు, అన్ని భాషలలో మాటలాడుచు మిత్రోపకారము చేయుచు, శత్రువుల, ప్రతిపక్షుల దృష్టికి సైతము మిత్రగా ప్రత్యక్షమగును. ప్రతి వ్యక్తి రక్షణార్ధమై పాటుపడగల ఉద్యోగధర్మ మాచరించు నిమిత్తమై, మానవ జీవనాధార రక్షకుడగు యేసుక్రీస్తు నామమున వెడలుచున్నది. మిత్రలోని విషయములన్నియును దైవమిత్రులను అవివాహితులునగు దేవదాసు అయ్యగారివలన ఉపదేశింపబడినవి. అచ్చుపడని వారి ఉపదేశ గ్రంథములు యింకను అనేకములు గలవు. ప్రభువు కాలక్రమమున వాటినికూడ ముద్రించునుగాక!

**పెండ్లికుమారుడుగా రానైయున్న ప్రభువునందలి**

**రెవ. జె. శామ్యేల్ కిరణ్**

ప్రెసిడెంట్, బైబిలుమిషను.

Bible Mission HQ Guntur